"తిరుమల క్షేత్రదర్శిని గ్రంథమాల"

# శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం

**- ఆచార్య హెచ్.ఎస్. బ్రహ్మానంద**

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి**

"తిరుమల క్షేత్రదర్శిని గ్రంథమాల"

# శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం

రచన

**ఆచార్య హెచ్.ఎస్. బ్రహ్మానంద**

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2014**

# SRI VENKATESWARA SWAMY DARSANAM

**By**
**Prof. H.S. Brahmananda**

T.T.D. Religious Publications Series No. 904
© All Rights Reserved

*First Edition : 2012*
*Re-print : 2014*

Copies: 3000

*Published by :*
**M.G. GOPAL** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Office of the Editor in Chief,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

**“వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి”**

వేంకటాద్రికి సమానమైన మరో క్షేత్రం ఈ బ్రహ్మాండంలోనే లేదు. వేంకటేశ్వరునికి సాటి రాగల దేవుడు ఇంతవరకు ఎక్కడా లేదు. ఇక మీదకూడ ఉండదు – అని అర్థం.

కలియుగ వైకుంఠంగా భాసిల్లే శ్రీవేంకటాద్రిపై అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి అవతరించి నిత్యమూ భక్తులకు దర్శనమిస్తూ వారిని తరింపజేస్తున్నాడు. శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహమూర్తిని ఒక్క క్షణకాలమైనా దర్శించుకొని తరించడానికి వేలకొద్దిమంది భక్తులు నిత్యమూ ఈ క్షేత్రానికి యాత్ర చేస్తుంటారు.

పిలిస్తే పలికే ప్రత్యక్షదైవమూ, కోరిన వరాలరాయడూ ఐన శ్రీ వేంకటేశ్వరస్వామి వెలసిన ఈ క్షేత్రంలోని స్వామి దివ్యమంగళ విగ్రహం, స్వామి పుష్కరిణి, పవిత్రతీర్థాలు, స్వామికి అతివైభవంగా జరిగే నిత్యకైంకర్యాలు, స్వామి బ్రహ్మోత్సవాలు మొదలైన విశేషాలు భక్తులకు తెలియజేయాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం ‘తిరుమల క్షేత్రదర్శిని’ అనే పేర ఒక గ్రంథమాలను ప్రారంభించి, ఆ యా పండితులచేత గ్రంథాలను రాయించి ప్రకటించాలని తలపెట్టింది.

ఈ గ్రంథాలలో, ప్రస్తుతం ఆచార్య హెచ్.ఎస్.బ్రహ్మానందగారు రచించిన **‘శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం’** అన్న ఈ గ్రంథాన్ని భక్తులకు అందజేస్తున్నాము. భక్తులీ గ్రంథంద్వారా స్వామివారి అవతారవైభవాన్ని తెలుసుకొని ధన్యత నొందుదురుగాక అని ఆకాంక్షిస్తున్నాము.

*సదా శ్రీవారి సేవలో....*

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# విషయసూచిక


| | |
|---|---|
| పీఠిక | i - iii |
| దర్శనాన్ని సుదర్శనంగా మార్చుకోండి! | v - viii |
| అధ్యాయం - 1<br>**క్షేత్రదర్శనం** | 1 - 11 |
| అధ్యాయం - 2<br>**తీర్థదర్శనం** | 12 - 18 |
| అధ్యాయం - 3<br>**అర్చామూర్తి దివ్యదర్శనం** | 19 - 34 |
| అధ్యాయం - 4<br>**ఉత్సవదర్శనం** | 35 - 42 |
| అధ్యాయం - 5<br>**దర్శనసాఫల్యం** | 43 - 53 |
| అధ్యాయం - 6<br>**పునర్దర్శన ప్రాప్తిరస్తు** | 54 - 56 |
| అధ్యాయం - 7<br>**పిలిస్తే పలికే అంతర్యామి** | 57 - 65 |

# పీఠిక

శ్రీవారి సుప్రభాతంలో భాగమైన మంగళాశాసనంలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనంలోని ఒక మధురానుభూతిని ఇలా వర్ణించాడు.

**సర్వావయవసౌందర్య - సంపదా సర్వ చేతసామ్**
**సదా సమ్మోహనాయాస్తు - వేంకటేశాయ మంగళమ్**

(తన అన్ని అవయముల సౌందర్యంచేత సమస్తజనుల్నీ సమ్మోహనపరచే శ్రీ వేంకటేశ్వరస్వామికి మంగళమగుగాక!)

అంటే శ్రీవారిదర్శనంలో ఒక 'సమ్మోహన' లక్షణమున్నదని అర్థం. ఈ సమ్మోహన లక్షణాన్నే ఈ గ్రంథంలో శ్రీవారు 'పలికించిన' రీతిగా వర్ణించే ప్రయత్నం చేస్తాను.

శ్రీవారిని దర్శించుకొన్న తరువాత మరలా మరలా వెనక్కితిరిగి చూసుకుంటూ ఇంకా చూడాలనిపించే మనస్సుతో భక్తులు తిరిగివస్తారు. దీన్నిగురించి కూడా మంగళాశాసనంలో ఇలా వివరించారు.

**ఆకాలతత్త్వ మశ్రాంత - మాత్మనామనుపశ్యతామ్**
**అతృప్త్యమృతరూపాయ - వేంకటేశాయ మంగళమ్**

(కాలతత్త్వం నిండేదాకా - ఎడతెగకుండా తనను దర్శించే ప్రాణికోటికి తృప్తిలేని అమృతస్వరూపం కల్గినటువంటి శ్రీ వేంకటేశ్వరస్వామికి మంగళమగుగాక)

యుగయుగాలుగా భక్తులు స్వామివారిని దర్శిస్తూనే ఉన్నారు. ఈవాళ- రేపూ ఇలాగే దర్శిస్తూ ఉంటారు. కాని ఒకరికి కూడా 'అబ్బా! స్వామిదర్శనంతో తృప్తిపడ్డాం' అనిపించదు. అంటే ఇంకా చాలాసేపు చూడాలని చాలామంది కోరుకుంటారు. కాస్సేపు అదనంగా ఇంకా చూసినా ఇంకా చూడాలనిపించే

ఏదో ఒక దివ్య 'రహస్యం' ఆ స్వామివారి దివ్యవిగ్రహంలో ఉంది. అది ఒట్టి విగ్రహం మాత్రంకాదు. జనజీవాలతో కూడిన దివ్యశరీరాకృతి. ఇంకా మధురమైన మనస్సు, అపారమైన విశాలబుద్ధి. పదునాల్గు భువనాలలోనూ వ్యాపించే దివ్యాత్మ చైతన్యం – కల్గిన ఒక దివ్యపురుషోత్తముని 'భవ్య' రూపదర్శనంచేత పులకితగాత్రులై, శరీరాలు కంపిస్తుండగా, కళ్ళల్లో నీళ్ళు జలజలరాలుతుండగా, జన్మాంతర పుణ్యపాపాల సంపుటిని కదిలించి భక్తుడిలో ఏమూలలోనో దాగివున్న చిద్రూపాన్ని బయటికి తీసి ఒక లిప్త చూపించి మరలా ఈ మాయా 'జగత్తు' అనే మూతమూసి ముందుకి తోసే ఒక దివ్యశక్తి ఆనందనిలయవిమానంలో విరాజిల్లుతూ ఉంది.

అందుకే ఒక చిత్రం జరుగుతుంది. బంగారువాకిలిదాకా ఎన్నో కోరికలు కోరాలని, స్వామివారితో ఏదేదో చెప్పుకోవాలని తహతహలాడే భక్తులు, గంటలతరబడి క్యూలో నిలబడి ఓపిక నశించి చిరాకుతో చిన్నపిల్లల్లా ఒకరిపై ఒకరు దూకి స్వామిని దర్శించుకోవాలన్న తీవ్ర ఆకాంక్షతో ఉన్నవారు కూడా స్వామివారి దివ్యమంగళ విగ్రహాన్ని దర్శించగానే, "ఓం నమో వేంకటేశాయ" అనే దివ్యనామనామం వినగానే, భక్తుల కోలాహలం మధ్య గోవిందనామ స్మరణం చేస్తున్నాకూడా – ఒక ధ్యానావస్థలోకి 'జయవిజయుల' విగ్రహాల సమీపంలోనే వెళ్ళిపోతారు. ఆ తరువాత స్వామివారిని ఒక క్షణం చూసినా చాలు, కన్నురెప్పలు వాటంతట అవే ఠపీమని మూతపడి వెంటనే దీపాల్లాగా వెలిగిపోతాయి. శ్రీ స్వామివారి దివ్యాశీస్సులను 'చూపు'ల్లో భద్రపరచుకుని, ఏ కోరికలూ అడగకుండానే 'అమృతం' రుచి చూసిన దేవతాల్లాగా – నిర్వికారమైన చిత్తాలతో, ఈ భూస్పర్శను మరచి వెనుదిరుగుతారు. ఈ శుభక్షణంకోసమే ఎన్నో వందల వేలమైళ్ళనుండి భక్తులు తిరుమలమీద వచ్చి వాలుతారు.



ఇదంతా శ్రీనివాసునికి, భక్తునికి నడుమ జరిగే ఆధ్యాత్మిక దర్శనానుభూతి. ఇది ఎవరికి వారే హృదయంలో పదిలపరచుకోవటంవల్ల ఎవరికీ ఏమీ చెప్పలేని పరిస్థితి. ఈ మాయనుండి బయటపడే లోపల హుండీలో కానుకలు వేయటం, స్వామివారి మధుర ప్రసాదాన్ని స్వీకరించటం, గుడినుండి బయటికి రావటం జరిగిపోతుంది.

కాని గుడిలోనికి వెళ్ళటానికి ముందు బయటికివచ్చిన తరువాత కూడా శ్రీనివాసుని దర్శనానికి సంబంధించిన చాలా ధార్మిక సంస్కారం ఉంది. ఈ సంస్కారాన్ని గురించే ఈ చిన్న గ్రంథంలో చెబుతాను.

యుగయుగాలనుండి వచ్చి భక్తులు స్వామివారిని ఎలా సేవించారో, దర్శించారో వారి సేవాఫలంగా తిరుమల – తిరుపతి 'దివ్యభూమి' గా ఎలా పరిగణన పొందిందో; ఈ క్షేత్రంలోని సకల దేవతా రూపాల్లోనూ విష్ణుస్వరూపుడైన శ్రీనివాసుడే ఎలా దర్శనమిస్తాడో వివరించడమే ఈ గ్రంథ ప్రయోజనం.

***శ్రీనివాసో విజయతే***

**– హెచ్.ఎస్. బ్రహ్మానంద**

# దర్శనాన్ని 'సుదర్శనం'గా మార్చుకోండి!

శ్రీవారిదర్శనం ఒక వి.ఐ.పి.ని చూసి మొరలు వినిపించి తక్షణం పరిహారం పొందటంలాంటిది కాదు. స్వామివారి దర్శనం 'సుదర్శనం' కావాలి. 'సు' అంటే మంచి 'దర్శనం' (జ్ఞానం) ప్రసాదించేది కావాలి. రాక్షసులకు సుగతినే చూపించే ఆయుధం కావటంవల్లనే శ్రీ మహావిష్ణువు ధరించిన చక్రాయుధానికి సుదర్శనమని పేరు.

ఈవాళ తిరుమల తిరుపతి దేవాలయాల దర్శనం పిల్లలకు ఒక వినోదంగా, యువతీయువకులకు విహారంగా, ధనవంతులకు డాబుసరిని చూపించుకోవడానికి ఒక దర్జాగా మారిపోయిందని చాలామంది పెద్దలు బాధపడుతున్నారు. ఈ బాధను ఒకింత అర్థం చేసుకుందాం.

ఈ 'విహార' యాత్రాభావన ఎంత తప్పో నిరూపించడంకోసమే ఈ గ్రంథంలో మొదటి నాల్గు అధ్యాయాలను రచించడం జరిగింది. తిరుమల క్షేత్రం తరతరాల చరిత్ర గల్గిన తపోభూమి అని ఎంతోమంది మహర్షులు, దేవతలు, పుణ్య పురుషులు, ముక్తాత్ములు నడయాడిన 'దివ్యభూమి' అని మొదటి అధ్యాయంలో చూస్తారు. ఈ క్షేత్రం పవిత్రం కావటానికి సర్వపాపాలను పోగొట్టి, సదసద్వివేకాన్ని కల్గించి, ధర్మం బోధించి, విముక్తిని ప్రసాదించే ఎన్నో పుణ్యతీర్థాలున్నాయని, ఆయా తీర్థాల కథల్ని తలుచుకొని స్నానంచేసి తొలుత పునీతులు కావాలని రెండో అధ్యాయం వివరిస్తుంది. మూడో అధ్యాయంలో అతిలోక రమణీయమైన చిద్రూపం ఘనంగా ఆనందనిలయ విమానంలో ఉంటూ ప్రపంచాన్ని తనవైపు ఎలా ఆకర్షిస్తోందో చూస్తారు. నాల్గవ అధ్యాయంలో 'ఉత్సవ' వైభవం వివరించడం జరిగింది.

ఇదంతా స్వామికి సంబంధించిన దర్శనమే. కాని ఈ దర్శనం సఫలం ఎప్పుడవుతుంది? ఇప్పటిరోజుల్లో స్వామి దర్శనం ఎలా చేసుకుంటున్నాం? ఎన్నివిధాల అనుచిత మార్గాలను అనుసరిస్తున్నాం? ఇలా స్వామిని దర్శించినంత మాత్రాన మన పాపాలు పోయి పుణ్యాత్ములం అవుతామా! ఇదే ఐదవ అధ్యాయంలోని విషయం.

అసలు పుణ్యక్షేత్రాలకు ఎందుకు వెళ్తాం? తీర్థాలలో ఎందుకుస్నానం చేస్తాం? అన్న విషయాన్ని మన సమకాలీనలోకం మరచిపోయింది. అందుకే తొలి రెండు అధ్యాయాల్లో పుణ్యక్షేత్ర దర్శనంవల్ల ధార్మికజ్ఞానం కలుగుతుందని; తీర్థస్నానంవల్ల పాపం నశిస్తుందని పురాణాలు చెప్పిన అంశాలను ఆధారంగా వివరించడం చూస్తారు.

శ్రీ స్వామివారి దర్శనం చేయడానికి ముందు, దర్శనం చేసేటప్పుడు, దర్శనానంతరం ఏయే పనులు చేయాలి, ఏవేవి చేయకూడదు; ఆహార విహార నియమాలు ఏమిటి? వాటి ప్రాధాన్యం ఏమిటి? తోటి భక్తులపట్ల ఎట్లా ప్రవర్తించాలి! అర్చకులను, దేవాలయ సిబ్బందిని, పరిచారకులను ఎలా చూడాలి! మొదలైన విధి నిషేధాలన్నీ చివరి అధ్యాయంలో వివరించడం చూడవచ్చు. ఈ విషయాలు 6, 7 అధ్యాయాల్లో ఉన్నాయి.

ఇక శ్రీవారిదర్శనంలో రెండు భాగాలు – మూలమూర్తి దర్శనం; రెండవది ఉత్సవాలలో శ్రీవారి దివ్యానుభూతి. వీటిని పొందటానికి భక్తుల సమస్యలు చాలా ప్రశాంతంగా ఉండాలి. ప్రశాంతత ధార్మికతవల్ల వస్తుంది. పాపకార్యాలకు దూరంగా ఉండటంవల్లనే ధార్మికత సిద్ధిస్తుంది. ఆలయంలో పాటించాల్సిన ఈ దేహ, మనో, ఆధ్యాత్మిక, సామాజిక ధర్మసూక్ష్మాలను గ్రంథంలో ప్రతిచోటా వివరించడం గమనిస్తాం.

శ్రీవారిదర్శనం ప్రశాంతతను కల్గించేది కావాలి. అప్రశాంతమనస్కులై శ్రీవారిని దర్శించినా అది 'మొక్కుబడి' మంత్రంలాగా పరిమితమైన ప్రయోజనం



మాత్రమే కల్గుతుంది. అలాకాకుండా శ్రీవారి దర్శనం అనంత ప్రయోజనాల్ని కల్గించేదిగా మలచుకోవాలి.

పుణ్యక్షేత్రాలకు వెళ్ళటం వల్ల మనిషి సంస్కారంలో మార్పు రావాలి. రజస్తమోగుణాలు అణగి సత్త్వగుణం ప్రకాశించాలి. దీన్ని గురించిన కథ ఒకటి 'తుకారాం' గారికి సంబంధించినది పెద్దలు చెప్పగా విన్నాను. ఆ కథను తెలుసుకొందాం.

ఒకసారి తుకారాం బంధువులు, మిత్రులు చుట్టూ ఉన్న పుణ్యతీర్థాలకు, క్షేత్రాలకు ప్రయాణం కట్టారు. వారితోపాటు తుకారాం కూడా ఉంటే వారికి బాగా కాలక్షేపం అవుతుందని, ఏవో నాలుగు మంచి విషయాలు చెవిలో వేసుకోవచ్చనీ వారు భావించారు. తుకారాం గురించి వారికి తెలిసిందీ అంతమాత్రమే.

తుకారాంగారు అన్నారట : "నాకు సంకీర్తనలు పాడుకోవడంతోనే కాలం గడిచిపోతుంది. పాండురంగడు నాముందే ఆడుతుంటాడు. అయినా మీ యాత్రను నేను వద్దనను. నా బదులుగా ఒక ప్రతినిధిని పంపిస్తాను. తీసుకువెళ్ళండి' అంటూ; ఇంటివెనుక తోటలో కాచిన ఒక చేదు దోసకాయను తెచ్చి వారికిచ్చారట.

భక్తులకు ఈ చర్యలోని రహస్యం బోధపడలేదు. తుకారాం కోరినవిధంగానే అన్ని తీర్థాలలో తాము మునిగినప్పుడు దోసకాయనూ ముంచి తరువాత బాగా తుడిచి సంచిలో జాగ్రత్తగా తెచ్చి ఆ మహాభక్తుడికి అప్పగించారట.

తుకారాం ధన్యవాదాలు తెలుపుతూ వారినందర్నీ కూర్చోమన్నారట. వంట ఇంటిలోనుండి ఒక కత్తి తెప్పించి దోసకాయను చిన్న ముక్కలుగా కోసి ఆ భక్తులందరికీ ప్రసాదంలాగా పంచి తినమన్నారట. తింటే ఏముంది?

భయంకరమైన 'చేదు'గా ఉంది ఆ దోసముక్క! అందరూ వికారంగా ముఖాలు పెట్టారట.

దాన్ని గమనించి తుకారాంగారు అన్నారట : "ఏమిటి? చేదుపోలేదా! అది చేదు దోసకాయని నాకు తెలుసు. తీర్థాలలో మునిగితే చేదు పోయి తీపి దోసకాయ అవుతుందనుకున్నా. పాపం! చేదు పోలేదన్నమాట" అని చమత్కారంగా పెదవి విరిచి పాండురంగడిని గురించి పాడుకుంటూ వెళ్ళిపోయారట.

ఈ కథ చెబుతున్న రహస్యం ఏమిటంటే – తీర్థయాత్రవల్ల మనిషిలోని దుర్గుణాలు పోవాలి. సద్గుణాలు అలవడాలి. తుకారాం పెదవి విరిచింది దోసకాయముక్కను గురించి కాదు – తీర్థయాత్రలు చేసి తిరిగివచ్చినా అహంకార మమకారాలు, కామక్రోధాలు నశించని భక్తులనబడేవారిని గురించి.

ఎంతో కష్టపడి వేలకొద్దీ భక్తులు ప్రతిరోజూ ఆలయానికి వస్తుంటారు. వారిలో ఎవరి భక్తి గొప్పది, ఎవరిది తక్కువ – అని పొరపాటున కూడా చెప్పలేం.

**యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్** – అన్న గీతాకారుడి ప్రబోధం గుర్తుంచుకోవాలి. (ఎవరు నన్ను ఎలా శరణు వేడుతారో వారిని అలాగే నేను అనుగ్రహిస్తాను). స్వామివారిని 'జ్ఞానం' కోరి 'ముక్తి' కోరి దర్శించండి. అప్పుడు అది 'సుదర్శనం' అవుతుంది. ఉన్నత పదవిని కోరినప్పుడు జీవితం సుగమం కావటం తథ్యం– అంటే సిరిసంపదలు, సత్సంతానం, ఆరోగ్యం, వైరాగ్యం, ఇవన్నీ సిద్ధిస్తాయి. అందుకే మీ దర్శనాన్ని సుదర్శనంగా మార్చుకోవాలి.



**అధ్యాయం - 1**

# క్షేత్రదర్శనం

'తిరుమల' అత్యంత ప్రాచీనమైన పురాణ ప్రసిద్ధి ఉన్న పుణ్యక్షేత్రం. మహావిష్ణువు శ్రీరామ, శ్రీకృష్ణ అవతారాల తరువాత కలియుగ ప్రారంభంలో స్వీకరించిన రూపమే శ్రీనివాసస్వామి. ఆ స్వామివారి అర్చారూపమే శ్రీ వేంకటేశ్వరస్వామి.

దీనికి ఆదివరాహక్షేత్రమని పేరు. పురాతత్త్వ పరిశోధకులు దీని ప్రాచీనత 200 కోట్ల సంవత్సరాలపైచిలుకు అని చెబుతున్నారు. వేదాల కాలంనుంచీ కూడా భక్తులు పరమపవిత్రమైన ఐశ్వర్యప్రదమయిన దివ్యక్షేత్రంగా తిరుమలను భావిస్తూ వచ్చారు. ఆనాటినుండి కూడా ఇది పరమవైష్ణవ క్షేత్రమే.

**'విష్ణుః పర్వతానామధిపతిః'**

అని శ్రుతివచనం. అందుకే విష్ణ్వాలయాలు చాలావరకు కొండకోనల్లో ఉండటం గమనిస్తాం. అంతేకాదు ఋగ్వేదంలో ఈ ప్రాంతాన్ని శ్రీ పీఠమని కూడా పిలిచారు.

**అరాయికాణే వికటే గిరిం గచ్ఛ సదాన్వే**
**శిరింబిఠస్య సత్త్వభిస్తేభిష్ట్వాచాతయామసి**

**(ఋగ్వేదం 10-15-1)**

ఓ భక్తుడా! నీవు ధర్మార్థ కామమోక్షాలనే పురుషార్థాలను కోరిన వాడివైతే; నిర్ధనుడివైనా, బాహ్యాంతర దృష్టులులేని అజ్ఞానివైనా; (కన్నులు లేనివాడవైనా), తాపత్రయంతో తల్లడిల్లుతున్న వాడివైనా; పాపపరిహారంకోసం, ఐశ్వర్య

శ్రేయోమార్గాలు సిద్ధించడానికి, శ్రీనివాసుడు వేంచేసి ఉన్న శ్రీ పర్వతానికి వెళ్ళి అక్కడ స్వామివారి సేవాతత్పరులైన 'తదీయుల' ద్వారా శ్రీవారిని ప్రార్థించు.

నిజమే. వేదంలోని ఇంద్రఉపేంద్ర సంవాద భాగాన్ని చదివినా, శ్రీ వేంకటాచల మాహాత్మ్యంలోని భృగుమహర్షి వృత్తాంతం చదివినా; శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవిని అన్వేషిస్తూ ఈ భూలోకానికి వచ్చి, తనకు ఇష్టమైన ఈ క్షేత్రంలో స్థిరంగా శ్రీతోకూడి నివసిస్తున్నాడని అందుకే ఆయనకు శ్రీనివాసుడని పేరు ఏర్పడిందని తెలుస్తుంది. శ్రీ ఎవరికి నివాసమో అతడే శ్రీనివాసుడు. ఎవనియందు శ్రీ ఉన్నదో అతనే శ్రీనివాసుడు. అందుకే దీన్ని 'శ్రీపీఠ'మని వేదమన్నది. శ్రీ–తిరు; పర్వత–మల; శ్రీపర్వతమని; శ్రీశైలమనికూడా ఈ పర్వత శ్రేణిని పిలుస్తారు. తిరుమల అంటే అర్థం ఇదే. ఇది నవనిధులకు అధిపతి అయిన కుబేరునికి లక్ష్మిని ప్రసాదించే శ్రీనివాసుడున్నచోటు. కనుక సర్వవిధాలా ఇది ఐశ్వర్యాన్ని ప్రసాదించే దివ్యక్షేత్రంగా పేరు పొందింది.

అది కృతయుగంలో జరిగిన కథ. వరాహస్వామి రూపంలో శ్రీమహావిష్ణువు భూమిని సముద్రంలోనుండి ఉద్ధరించాడు. అప్పటినుంచి వరాహస్వామి ఈ తిరుమల గిరిపైనే రమతోకలిసి హాయిగా విహరిస్తూ ఉన్నాడని పురాణాలు చెబుతున్నాయి.

**మాయావీ పరమానందమ్**
**త్యక్త్వా వైకుంఠముత్తమమ్**
**స్వామిపుష్కరిణీతీరే**
**రమయా సహ మోదతే** **(బ్రహ్మాండపురాణం)**

'మాయావి' అయినటువంటి శ్రీమహావిష్ణువు ఆనందప్రదమైన వైకుంఠాన్ని వదిలిపెట్టి స్వామిపుష్కరిణీ తీరంలో రమాదేవితో హాయిగా క్రీడిస్తున్నాడు అని అర్థం.



శ్రీ వరాహస్వామి ఇప్పటికీ పుష్కరిణికి వాయవ్యభాగంలో లక్ష్మీసహితుడై విరాజిల్లుతున్నాడు. వీరివద్దనే శ్రీనివాసుడు 100 అడుగులచోటును యాచించి ఆలయం నిర్మించుకొని ఉంటానని; నా భక్తులు సమర్పించే కానుకల్లో నీకూ భాగమిస్తాడని చెప్పినట్టు పురాణాలు చెబుతున్నాయి.

సాధారణ మానవుడిలాగా శ్రీమహావిష్ణువు ఆడిన ఈ 'మాయా' నాటకం కలియుగ ప్రారంభంలో జరిగింది. ఆ సమయంలో శ్రీనివాసుడు రెండు వరాలను వరాహస్వామికి ప్రసాదించాడు :

1. ప్రథమ దర్శనం 'వరాహస్వామి వారికే' అంటే శ్రీవారిని దర్శించడానికి ముందు పుష్కరిణిలో స్నానంచేసి వరాహస్వామి వారిని దర్శించుకొని తరువాత ఆనందనిలయంలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారిని చూడాలన్న యాత్రాదర్శన నియమం – ఇది మొదటి వరం.
2. ప్రథమ నివేదనం (నైవేద్యం) వరాహస్వామివారికే. తరువాతనే శ్రీనివాసుడిని నివేదన – ఇది రెండో వరం.

మరో అంశాన్ని కూడా పెద్దలు చెబుతారు.

వరాహస్వామి వారికి 'గోవిందు'డన్న పేరుంది. 'మహావరాహో గోవిందః' అని విష్ణు సహస్రనామం పేర్కొంటున్నది. గో = భూమిని; విందః = పొందినవాడు; – ఇదే పేరుతోనే కలియుగంలో భక్తులు నన్ను పిలుస్తారు – అని శ్రీనివాసుడు ఆనతిచ్చాడు.

తిరుమల క్షేత్రానికి వెళ్ళగానే శ్రీవరాహస్వామివారి పురాణగాథ, స్మరణలోకి రావడమే – ఇక్కడ శ్రీవారిదర్శనం వెనుక ఉన్న పౌరాణిక స్మృతి. దీనిచేతనే తిరుమలపై అడుగుపెట్టగానే భూలోకపరిధినుంచి మనిషిపైకెగిరినట్టు అనిపించడం. ఇది యుగయుగాల భక్తులు దర్శించి – అనుభవించిన

దివ్యానుభూతి. అందుకే పురాణాల కాలంలోనే వేంకటాద్రి వంటి క్షేత్రంగాని, శ్రీనివాసుడి వంటి దైవంగాని లేడని భక్తులు అనుకొంటూ ఉండేవారని కూడా బ్రహ్మాండపురాణమే చెబుతున్నది.

**వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి –** అని.

బ్రహ్మాండమంతా వెదికినా వేంకటాద్రిలాంటి క్షేత్రం; వేంకటేశుని వంటి దైవం; పూర్వకాలంలో లేడు. రాగల కాలంలో ఉండబోడు.

శ్రీకృష్ణావతారం ద్వాపరయుగంలో జరిగింది. శ్రీ కృష్ణనిర్యాణం తరువాతనే కలియుగం ప్రారంభమయింది. పద్మావతీ దేవికి తాను ఎవరో చెబుతూ శ్రీనివాసుడు ఇలా అన్నాడు :

**సింధుపుత్రకులం ప్రాహుః అస్మాకం తు పురా విదుః**
**జనకో వసుదేవస్తు జననీ దేవకీ మమ**
**అగ్రజశ్శ్వేతకేతుస్తు సుభద్రా భగినీ మమ**
**పార్థోఽపి మే సఖా దేవి పాండవా మమ బాంధవాః**

పురాణాలు తెలిసినవారు నాది సింధుపుత్ర కులమని (చంద్రవంశమని) అంటారు. నా జనకుడు వసుదేవుడు, జనని దేవకి, బలరాముడు అన్న; సుభద్ర చెల్లెలు; పార్థుడు స్నేహితుడు, పాండవులు నా బంధువులు.

'అంజనాద్రి' అని ఒక పర్వతం సప్తగిరులలో ఒకటి ఉంది. ఇక్కడే హనుమంతుడు పుట్టాడని, శ్రీరామవనవాస కాలంలో ఇక్కడికి శ్రీరాముడు వచ్చాడని ఒక పురాణగాథ ఉన్నది. శ్రీవారి సుప్రభాతంలో శ్రీరాముని ప్రసక్తి ప్రారంభంలోనే కనిపిస్తుంది.

**కౌసల్యాసుప్రజా రామ – పూర్వా సంధ్యా ప్రవర్తతే**
**ఉత్తిష్ఠ నరశార్దూల – కర్తవ్యం దైవమాహ్నికమ్ ॥**



కౌసల్యాదేవి సత్సంతానమైన శ్రీరామా! తూర్పు తెల్లవారుతోంది. దేవపూజాది కృత్యాలు నెరవేర్చవలసి ఉంది. పురుషోత్తమా! నిద్ర మేలుకో!

దీనికి ప్రమాణమా అన్నట్టు శ్రీవారి ఆలయంలో మొదటి ప్రాంగణాన్ని (బంగారు వాకిటిలోపల) శ్రీరాములవారి మేడ (జయవిజయుల వెనుకభాగం) అనే అంటారు. బంజారా భక్తులు (హథీరాం సంప్రదాయం వారు) 'శ్రీరాం బాలాజీ' అనే శ్రీవారిని అర్చిస్తారు.

ఇలా శ్రీరామకృష్ణుల అవతార కథల స్మృతి ఉండటం తిరుమల క్షేత్ర దర్శనానికి ఒక దివ్యస్పర్శను కల్గిస్తున్నది. తిరుమలమీద ప్రతిరాయి, చెట్టు, కొండ, కోన, గుహ, తీర్థం, క్రిమికీటకాలు, పశుపక్ష్యాదులు అన్నీ శ్రీవారి రూపాలే. శ్రీవారి భక్తుల రూపాంతరాలే. అందుకే భగవద్రామానుజులు (11వ శతాబ్దం) ఈ కొండపైకి మోకాళ్ళతో నడిచి వచ్చారట. పాదం సోకినా పాపమే – అన్న పవిత్రభావనను యుగపురుషుడైన భగవద్రామానుజులు పొందారంటే ఈ క్షేత్రం ఎంత పవిత్రమో, పౌరాణికమో, దివ్యమో అర్థం చేసుకోవచ్చు.

తిరుమల శ్రీవారిదర్శనం 'అలిపిరి' నుండి ప్రారంభమవుతుంది. పాదాల మండపంవద్ద 'తలయేరు' గుండుకు తల తాకించి, కొండమెట్లపైన అధిరోహిస్తూ 'గాలిగోపురం' వద్దకు చేరుకోగానే దేహంలోని మలినాలన్నీ నశిస్తాయి. దేహంలోని ధాతువులు పవిత్రమవుతాయి. మోకాళ్ళమెట్లు ఎక్కగానే మనిషిలోని కామక్రోధలోభాదిగుణాలు నశించి సాత్త్వికచిత్త వృత్తి పొడసూపుతుంది. ఇలా తిరుమల క్షేత్రం మీద కాలు మోపగానే 'జీవుడు' మేల్కొంటాడు. ఆ జీవుడు పాపాలను పోగొట్టుకోవడానికి చేసే అత్యంత కఠినమైన సాధనే మెట్లమార్గంలో స్వామిని 'ఊర్ధ్వగతి' (ముక్తి) చూపించమని కోరుతూ పైకి ఎక్కటం. ఈ యోగమార్గ రహస్యమంతా పర్వతాధి రోహణక్రమంలో సూక్ష్మంగా దాగి ఉంది.

తాళ్ళపాక అన్నమాచార్యులు పుణ్యపురుషుడు (క్రీ.శ. 15వ శతాబ్ది) – ఆయనకు తిరుమల కొండ ఎలా కనిపించిందో ఒక సంకీర్తనలో చాలా గంభీరంగా వర్ణించి ఉన్నాడు :

**పల్లవి : అదివో అల్లదివో హరివాసము**
**పదివేల శేషుల పడగలమయము ॥అది॥**

**చరణాలు : అదె వేంకటాచల మఖిలోన్నతము**
**అదివో బ్రహ్మాదుల కపురూపము**
**అదివో నిత్యనివాస మఖిలమునులకు**
**అదె చూడు దదెమ్రొక్కు డానందమయము ॥అది॥**

**చెంగట నల్లదివో – శేషాచలము**
**నింగినున్న దేవతల – నిజవాసము**
**ముంగిట నల్లదివో – మూలనున్న ధనము**
**బంగారు శిఖరాల – బహుబ్రహ్మమయము ॥అది॥**

**కైవల్యపదము వేం – కటనగమదివో**
**శ్రీవేంకటపతికి – సిరులైనది**
**భావింప సకల సం – పద రూపమదివో**
**పావనములకెల్ల – పావనమయము ॥అది॥**

స్కాందపురాణంలో ఈ శైలాన్ని 'సువర్ణశైలం' (బంగారుకొండ) గా వర్ణించారు. శేషశైలమనే పేరున్న ఈ పర్వతశ్రేణి భాగం పరచుకొన్న పాములా కనిపిస్తుంది. ఈ గిరివర్ణం మామూలుగా నల్లరాతి వర్ణం కాదు. సూర్యకాంతులతో పచ్చటి వృక్షాల నడుమ కరిగించి పోత పోసిన బంగారు ముద్దలాగా భాసిస్తుంది. దేవతలు, మునులు, సిద్ధులు, కిన్నర, కింపురుషాదులు విహరించే దివ్య భూమి ఇది. రాత్రిపూట బ్రహ్మాది దేవతలు వచ్చి స్వామివారిని



సేవించి వెళ్తారనే పురాణకథనం కూడా ఉంది. ఇక్కడ బంగారమంటే సకల సంపదరూపమైన బంగారమే కాకుండా; యోగసిద్ధి కూడా బంగారమే (దీన్నే హేమతారకవిద్య అని వేమనవంటి మహాయోగులన్నారు); మోక్షలక్ష్మి కూడా ఒక బంగారమే – ఇదే బహుబ్రహ్మమయిన బంగారు శిఖరాలతో కూడిన శేషాద్రి అందించే జ్ఞానసంపద.

అందుకే ఇంకొక సంకీర్తనలో ఇది 'భూలోక వైకుంఠమే' అన్ని అన్నమయ్య తనివితీరా వర్ణించాడు :

**పల్లవి : కట్టెదుర వైకుంఠము – కాణాచయిన కొండ**
**తెట్టెలాయె మహిమలే – తిరుమలకొండ ॥కట్టె॥**

**చరణాలు : వేదములే శిలలై – వెలసినదీ కొండ**
**ఏదెస పుణ్యరాశులే – ఏరులైనదీ కొండ**
**గాదిలి బ్రహ్మాదిలో – కములకొనల కొండ**
**శ్రీదేవుడుండేటి – శేషాద్రి ఈ కొండ ॥కట్టె॥**

**సర్వదేవతలు మృగ – జాతులై సంచరించే కొండ**
**నిర్వహించి జలధులే – నిట్టచఱులైన కొండ**
**ఉర్వితపసులే తరువులై – నిలిచిన కొండ**
**పూర్వపుటంజనాద్రి యీ – పొడవాటి కొండ ॥కట్టె॥**

**వరములు కొటారులై – వక్కణించి పెంచే కొండ**
**పరగు లక్ష్మీకాంతు సో – బనపుకొండ**
**కురిసి సంపదలెల్ల – గుహల నిండిన కొండ**
**సిరులైన దిదివో – శ్రీ వేంకటపు కొండ ॥కట్టె॥**

కళ్ళెదురుగా కనిపిస్తున్న వైకుంఠమే ఈ తిరుమలకొండ – అని అన్నమయ్య వివరిస్తూ; ఇది ఒక శ్రీనిధి అని; అడుగడుగునా మహిమలు

నిండి ఉన్న దివ్యక్షేత్రమంటూ కొన్ని అపూర్వ విషయాలు చెప్పాడు. ఇక్కడ కనిపించే శిలలు వేదాలే. ఏరులు పుణ్యరాసులే. సత్యలోకం తరువాత ఉన్న వైకుంఠం ఇదే. దేవతలు మృగాలుగా సంచరిస్తారిక్కడ. సముద్ర జలాలు గట్టిపడి కొండ చరియలయ్యాయి. ఎంతోమంది మహర్షులు చెట్లుగా ఇక్కడ అవతరించారు. వరాలు కురిపించే 'కళ్ళం' ఇది. ఎన్ని వరాలు కోరినా తప్పకుండా ఇస్తుంది. వృద్ధినిస్తుంది. శ్రీనివాసుని శోభనాలకు ఇది చోటు. ఈ కొండగుహల్లో అనంత సంపదలున్నాయి. ఇదే వేంకటాద్రి మహిమ – అంటున్నాడీయన.

అన్నమయ్య చెప్పిన దానిలో ఏదీ అతిశయోక్తి కాదు. అనంతాళ్వాన్ మహాశయుడి గాథలో ఈ రహస్యం వ్యాఖ్యానించబడింది. ఒకసారి వారు దక్షిణ దేశయాత్రకని తిరుమలనుండి బయలుదేరారు. వారి శ్రీమతి వారికి తీపుతోకూడిన అటుకులు మార్గమధ్యంలో 'సాపాటు' కు ఏర్పాటు చేసింది. ఆ బెల్లపు అటుకులు మూటను తిరుమలకొండ దిగిన తరువాత ఒక మంచినీళ్ళ బావిదగ్గర విప్పారట. విప్పితే అందులో చీమలున్నాయట. వెంటనే ఆ చీమలకు అనంతాళ్వాన్ నమస్కరించి – "అయ్యో! ఎంత పాపం చేశాను. ఏ మహాతపస్వులు ఈ చీమలరూపంలో తిరుమలలో ఉండినారో. వీళ్ళకు స్వామివారికి వియోగం కల్పించానే" అని బాధపడి – మళ్ళీ కొండకు వెళ్ళి – కొండపైన ఆ మూటను విప్పి ఆ చీమలకు స్వామివారితో మరలా సన్నిధిని కల్పించినందుకు సంతోషపడ్డారట – అలా ఏర్పడింది ఈ క్షేత్రం 'పుణ్య' శీలమైనదన్న భావన.

వీరందరికన్నా మరొక భక్తుడు ఇంకా విచిత్రమైన కోరిక కోరాడు. ఆ మహనీయుడు కులశేఖర ఆళ్వారు (క్రీ.శ. 8వ శ.)

"స్వామీ! వేంకటాచాలపతీ! నీ ముందు రాతిగడపగా పడి ఉండినట్లయితే నిత్యమూ నీ ముఖారవిందాన్ని చూస్తూ ఉండవచ్చుగదా!" అని ప్రార్థించి



స్వామివారి గర్భాలయం ముందు 'గడప' రూపంలో ఇప్పటికీ దర్శనమిస్తున్నాడు. అందుకే గర్భగుడి గడపకు 'కులశేఖరప్పడి' అని అంటారు.

ఇలాంటి భక్తులు మదిలో మెదిలే సందర్భాలు ఈ క్షేత్రంలో కోకొల్లలు. అందుకే తిరుమల క్షేత్రాన్ని 'భూలోక వైకుంఠమని' సార్థకంగా పిలుస్తారు. శ్రీవారి దర్శనానికి ముందు మనల్ని ఆకర్షించే దివ్యధామమయిన తిరుమల కొండకు ఇంత పౌరాణిక ప్రశస్తి ఉంది. అదే స్వామివారి స్థానబలం. శ్రీవారి దర్శనంలో క్షేత్రదర్శనమే మొదటి దశ. ఈ క్షేత్రమే స్వామివారికున్న ప్రాకృతిక విభూతి. ప్రకృతి ఆయనకు ఒక రూపాంతరమే.

ఇలాగే శ్రీవారి కల్యాణానికి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచిన చింతచెట్టు; స్వామివారి కల్యాణానికి వంటలు వండిన ఆకాశగంగ, పాపవినాశాది తీర్థాలు; స్వామివారి చుబుకంమీద అనంతాళ్వాన్ చరిచిన 'గునపం'; స్వామిపై గొడ్డలి విసిరి మృతి చెందిన 'గొల్ల' (సన్నిధిగొల్ల) వాడు – అందరూ ప్రతిరోజూ భక్తుల్ని పలకరిస్తూ ఉండటం ఈ క్షేత్రంలోని మరో విశేషం.

మేల్కొలుపు, కల్యాణం, పవళింపు సేవలలో తమ పూర్వీకుల సంకీర్తనల్ని పాడుతూ, ఆడపిల్లవారి పెళ్ళి మర్యాదల్ని నిర్వహించే తాళ్ళపాక వంశీయులు, స్వామివారికి ఏకాంతసేవలో 'ముత్యాలహారతి'ని సమర్పించే తరిగొండ వెంగమాంబ వారసులు తరతరాలుగా తిరుమలలోనే నివాసం ఏర్పాటు చేసుకొని ఇప్పటికీ ఆ వారసత్వ సంపదను నిలుపుకొని తరిస్తున్నారు.

గోపీనాథునితో, ఎప్పుడో ప్రారంభమయిన వైఖానస ఆగమ పూజాపద్ధతి అలాగే కొనసాగుతూ ఉండటం; అనంతాళ్వాన్ సంతతి వారితో శ్రీమద్రామానుజాచార్యులవారు ప్రారంభించిన 'జియ్యంగార్' కైంకర్య వ్యవస్థ కూడా ఇప్పటికీ చెక్కు చెదరకుండా కొనసాగుతూ ఉండటం గమనించవచ్చు. వేదసంరక్షుడని శ్రీమహావిష్ణువుకు పేరు. అందుకే చతుర్వేద పారాయణం –

పురాణ ప్రవచనం – నిరంతరం సాగుతూ తిరుమల గిరులలో శ్రీ మహావిష్ణు మహిమను చాటుతూ ఆ క్షేత్రాన్ని పునీతం చేస్తుంటాయి.

ఇలా శ్రీవారి 'దర్శనం' భక్తులకు నవవిధ భక్తిమార్గాలలో ప్రథమంగా చెప్పబడిన వేదనాద 'శ్రవణం'తో ప్రారంభంకాగా – శ్రీనివాసుని గోవిందనామాల 'సంకీర్తనం', సదాగోవిందుని 'స్మరణ'లు భక్తుల హృదయాలలో భగవంతుని ఉనికిని గురించి ఘంటానినాదంలాగా ఘోషిస్తూ ఉంటాయి. ఇలా భక్తుడు భవబంధాల నుండి కాస్సేపు విముక్తుడై శ్రీవారి సన్నిధిలో ఆధ్యాత్మిక ప్రశాంతిని పొందుతాడు.

అన్యప్రదేశాల పాపాలు పుణ్యక్షేత్రంలో, తీర్థంలో నశిస్తాయని, అందుకే పుణ్యక్షేత్రాలలో తీర్థాలలో నియమబద్ధ నివాసం, జపతపయోగసాధనలు, అల్పాహార విహారనియమాలు మొదలైన సాత్త్విక జీవనమార్గాలను నిర్దేశించారు. వీటితో శారీరక – మానసిక – అంతశ్శుద్ధులు కలుగుతాయి.

అందువల్ల ఈ క్షేత్రం స్వామివారికి భౌతిక ప్రతీక అని చెప్పవచ్చు. ఏడుకొండల వరుసలు ఇందులో ప్రధానంగా ఉన్నాయి. వీటినే ఏడుకొండలు (సప్తగిరులు) అంటారు. 'ఏడుకొండలవాడా వేంకటరమణా గోవిందా!' అన్నది ఇక్కడ స్వామివారికి ప్రీతిపాత్రమైన సంబోధన. సప్తగిరీశుడు అంటే ఈ ఏడుకొండలలో లీలల్ని ప్రదర్శిస్తూ 'తిరుమల నాయకుడు'గా స్థిరంగా ఉన్నవాడని అర్థం.

**శ్రీ శేషశైల గరుడాచల వేంకటాద్రి**
**నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రిముఖ్యామ్**
**ఆఖ్యాం త్వదీయవసతే రనిశం వదంతి**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్**



స్వామీ! నీ నివాసమయిన ఈ తిరుమల కొండను శేషాద్రి, గరుడాద్రి, వేంకటగిరి, నారాయణాద్రి, వృషభాచలం, వృషాద్రి (అంజనాద్రి) మొదలైన పేర్లతో పిలుస్తారు. నీకు సుప్రభాతమగుగాక!

'వృష' శబ్దానికి ధర్మమని అర్థం. 'ధర్మగిరి' పైననే వేదపాఠశాల ఉన్నది. నారాయణాద్రి – నారాయణగిరి – స్వామి లీలావిలాస స్థానాలు. శేషాద్రి పురాణ ప్రసిద్ధి గలది. అంజనాద్రి ఆంజనేయుడి జన్మను తలపిస్తుంది. ఇలా స్వామివారి అనంత లీలావైభవం ఈ కొండలను అధిరోహిస్తున్న సమయంలో గుర్తుకువచ్చి స్వామి నిరంతరం మన మనోభూమికలో దర్శనం ఇస్తుంటారు.

క్షేత్రం – అంటే స్థానమని అర్థం. తిరుమల ఒక క్షేత్రం. కాని అందులో ఎన్నో తీర్థాలు (నదులు, వాగులు, జలాశయాలు) ఉన్నాయి. వీటిని దర్శించుకొని తపస్సు చేయడానికే యుగయుగాలుగా ఋషులు, దేవతలు, వచ్చేవారని, అలాగే మానవులు రావటం ప్రారంభించారని, అందుకే 'తీర్థయాత్ర' అనే పేరు వచ్చిందని పెద్దలు చెబుతారు.

వ్యాసమహర్షి 'తీర్థాభిగమనం' గొప్ప సత్కర్మ అని ఇలా సెలవిచ్చారు.

**'ఋషీణాం పరమం గుహ్యామిదం భరతసత్తమ!**
**తీర్థాభిగమనం పుణ్యం యజ్ఞైరపి విశిష్యతే!'**

భరతశ్రేష్ఠా! ఇది ఋషులకుకూడా పరమగోప్యమైన రహస్యం. తీర్థయాత్ర మహాపవిత్రమైన సత్కర్మ. ఇది యజ్ఞాలకన్నా గొప్పది.

* * *

## అధ్యాయం - 2

# తీర్థదర్శనం - స్నానం

తిరుమల క్షేత్రానికి సంబంధించిన స్థలపురాణం 'శ్రీ వేంకటాచల మాహాత్మ్యం'. అలాగే శ్రీనివాసునితత్త్వాన్ని వివరించే గ్రంథం 'శ్రీ వేంకటాచల ఇతిహాసమాల! ఈ రెండు గ్రంథాలలోనూ ప్రధానంగా చెప్పబడిన విషయం తిరుమల మీది పుణ్యతీర్థాలను గురించే. 66 కోట్ల తీర్థాలున్న క్షేత్రమిది. కొన్ని వందల తీర్థాలు పురాణాలలో చెప్పబడ్డాయి. చాలావాటి పేర్లు ఇప్పుడు మనకు తెలియవు. తెలిసిన ఆకాశగంగ, గోగర్భం, జాపాలితీర్థం, తుంబురుతీర్థం, గోగర్భం, పాపవినాశం, కుమారధార మొదలైన వాటి చరిత్రల్ని చదివినపుడు తీర్థయాత్ర మనిషిలో 'ధర్మ' స్మృతిని కల్గించడానికే అని స్పష్టంగా తెలుస్తుంది. వీటన్నిటి జలాలు నిరంతరం చేరి ఉన్న మహాతీర్థం పుష్కరిణి. స్వామివారి ఆలయానికి ఈశాన్యం దిశలో ఉన్న ఈ తీర్థం పరమ పవిత్రమైంది. పుష్కరాలలో 12 సంవత్సరాలకు మాత్రమే ఒకసారి సకలనదుల జలాలు సంగమిస్తాయని శాస్త్రవచనం. కాని స్వామిపుష్కరిణిలో అనుక్షణమూ సర్వనదుల సంస్పర్శ ఉంటుందని స్థలపురాణం పేర్కొంటున్నది. శ్రేష్ఠమైనది కాబట్టే 'స్వామి' పుష్కరిణి అయింది – అని ఇతిహాసం చెబుతున్నది. స్వామివారికి 'క్రీడాద్రి' శేషాద్రికాగా; జలకాలాడే పుణ్యతీర్థం ఈ పుష్కరిణి – అని; ఈ రెండింటినీ గరుత్మంతుడు వైకుంఠం నుండి తెచ్చి భూమిపై నిలిపాడని క్షేత్ర మాహాత్మ్యం వివరించింది. అందుకే ఎంతోమంది ఆర్తులు, రోగులు, తాపసులు, మునులు, దేవతలు, ఈ పుష్కరిణీ స్నానంతో పాపాలను పోగొట్టికొని శ్రీవారి కరుణను పొందారని ఎన్నో కథలున్నాయి.

సుమారు 5000 సంవత్సరాల నాటిది శ్రీవారి ఆలయమూల రూపం. అప్పటికి 'విరజానది' అనే నదియొక్క పాయ ఒకటి ప్రవహిస్తున్న చోట,



నదిగట్టున పద్మపీఠంమీద స్వామివారు ఉద్భవించారని కథ. దీన్నిబట్టి నదీ జలాల మధ్యనే స్వామివారి నెలవని తెలుస్తున్నది. శ్రవణ నక్షత్రం స్వామివారి జన్మనక్షత్రం. ఇది మకర రాశికి చెందింది. మకరానికి జలంలో 'పట్టు' ఎక్కువ. ధనం జలరూపం. అందుకే స్వామి ధనాకర్షణను అమితంగా చేస్తూ తన నదీతట నివాస బలాన్ని నిరూపిస్తున్నాడని జ్యోతిష్యతత్త్వం తెలిసినవారు చెబుతారు.

**ఆకాశగంగ**లోని నీటితోనే తిరుమలనంబి కాలంనుండి స్వామివారికి 'అభిషేకం' జరపడం సంప్రదాయం. ఇప్పటికీ శుక్రవారాభిషేకానికి ఆకాశగంగోదకాన్ని బ్రాహ్మణులు బిందెలతో తెస్తారు. దీన్ని గురించి కూడా శ్రీవారి సుప్రభాతంలో ప్రసక్తి ఉంది.

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడిని రాత్రివేళల అదృశ్యరూపులైన సకల దేవతాసమూహమూ అర్చించగా, అత్రి మొదలైన సప్తమహర్షులు ఆకాశగంగలోని కమలాలతో స్వామివారి పాదపద్మాలకు సమర్పణం చేస్తారట.

**జాపాలితీర్థం** – మరొక ముఖ్యమైన స్నానతీర్థం. ఒకప్పటి ఆంజనేయస్వామి వారి తల్లి అంజనాదేవి ఆశ్రమమే జాబాలి (జాపాలి) తీర్థమయిందని స్థలపురాణం చెబుతున్నది. ఇక్కడికివచ్చి శ్రీరాముడు వానరసైన్యంతో కలిసి స్వామి పుష్కరిణిలో స్నానం చేసిన తరువాతనే ఆయనకు 'స్వామిత్వం' (ప్రభుత్వం) సిద్ధించి రావణవధ, పట్టాభిషేకం జరిగాయని చెబుతారు. అంచేత ఇది త్రేతాయుగం నాటి ఒక కథను స్ఫురింపజేస్తున్నది. ఇంతేకాకుండా ఇప్పుడు శ్రీవారి ఆలయం ఉన్న ప్రదేశంలోనే హనుమంతులవారు శ్రీరామునికి ఒక కుటీరం నిర్మించాడని అందులో విశ్రమించి తరువాత దక్షిణ దిశగా స్వామివారు దండయాత్ర ప్రారంభించారని కూడా చెబుతారు.

వైకుంఠతీర్థమన్నది మరొక పుణ్యతీర్థం. ఇక్కడ ఒక గుహలోకి కొంతమంది వానర ముఖ్యులు ప్రవేశించి లోపల శ్రీమన్నారాయణుని దర్శించారట. తరువాతికాలంలో ఆ గుహ కనిపించలేదని 'వరాహ పురాణం'లో ఒక కథ చెప్పబడింది.

ఇలాంటి మరో పవిత్ర తీర్థం 'తుంబురు' తీర్థం. ఇక్కడే తరిగొండ వెంగమాంబ సుదీర్ఘకాలం తపస్సు చేశారని ఇతిహాసం చెబుతున్నది. అసలు ఈ తీర్థానికి ముందటి పేరు 'ఘోణ' తీర్థమని. తుంబురుడు ఒక గంధర్వుడు. బర్హి అనే మహారాజును చూసి అతని దానగుణంచేత ప్రభావితుడై 'నీవు వీరశూర దాన శిఖామణివి' అని పొగడ్తలతో అతన్ని ముంచేశాడు. దీనిని ఫలితంగా బర్హి మహారాజు వద్ద ఉన్న రత్నఖచితమైన వీణను బహుమతిగా పొందాడు.

వీణతోసహా తుంబురుడు నారదుడివద్దకు వచ్చాడు. నారదుడికి కోపం వచ్చింది. 'అయ్యో! భగవంతుడిని పొగడాల్సిన వాళ్ళం మనం. నీ నోటితో మనుష్యుల్ని పొగిడి పాపం మూటగట్టుకున్నావు. నీవు భూలోకంలో జన్మించి ఈ పాపఫలాన్ని అనుభవించు. విష్ణువు అనుగ్రహాన్ని పొంది మళ్ళీ గంధర్వుడివి అగుదువుగాని' అని శపించాడు.

అలా తుంబురుడు భూలోకం లోకివచ్చి ఘోరమైన తపస్సు చేశాడు. ఒక ఫాల్గుణమాసంలో అక్కడ బ్రహ్మాది దేవతలందరూ స్నానం చేయడానికి వస్తారు. వచ్చినపుడు 'వీరందరితో నాతోపాటు నువ్వు కూడా స్నానం చేయి' అంటూ శ్రీ స్వామివారు తుంబురునికి ఆజ్ఞ ఇచ్చాడు. అలా ఆ తీర్థంలో స్నానం చేయగానే మళ్ళీ గంధర్వరూపం, ఆకాశయానశక్తి లభించాయి.

ఈ తుంబురుడే త్రేతాయుగంలో 'విరాధుడనే' రాక్షసుడిగా జన్మించి శ్రీరామునిచేత వధింపబడి విముక్తి పొందాడు. ఈ తుంబురుడే ద్వాపరయుగంలో 'సంజయుడి'గా అవతరించి ధృతరాష్ట్రునికి మహాభారత



యుద్ధాన్ని వివరించాడు. సంజయుని ముఖంగానే శ్రీకృష్ణుడు బోధించిన 'భగవద్గీత' కూడా మనకు అందింది. ఇలా అన్ని యుగాలలోనూ ప్రతిధ్వనించే శ్రీ మహావిష్ణువు లీలలు ఇలాంటి పుణ్యతీర్థ గాథల్లో కనిపిస్తాయి.

ఇలాంటి తీర్థాలలో స్నానాలు ఎలా చేయాలి, అన్న విషయాన్ని గురించి శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్, 'తిరుమల లీలామృతం' అనే గ్రంథంలో ఇలా రాశారు:

'ఈ స్నానాలు జ్ఞానంతో చేయాలి. తీర్థమహిమ తెలుసుకొని చేయాలి. మహిమ తెలుసుకుని స్నానం చేసేటప్పుడు ఆ తీర్థమహిమ తలచుకొని, ఎవరెవరు ఈ తీర్థాలలో స్నానం చేశారో తరించారో వారిని స్మరించుకొని, తాను చేసిన పాపాలకు పశ్చాత్తాపపడుతూ స్నాన చేసినచో వచ్చే స్నానఫలాన్ని కృష్ణార్పణమస్తు అని శ్రీనివాసునికి సమర్పిస్తే – ప్రక్షాళనకాని పాపముండదు. రాని పుణ్యముండదు' (పు. 52)

శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనంలో భాగమయిన తీర్థదర్శనం – స్నానం – పాపప్రక్షాళన కల్గిస్తాయన్న విషయం చాలా ప్రధానమైంది. 'వేం' అంటే పాపమని, 'కట' అంటే దహించడమని – పెద్దలు వివరించారు. పాప ప్రక్షాళన జరిగేది ఈ తీర్థాలస్నానం వల్ల అన్నది చెప్పటంకోసమే ఈ తీర్థాల విషయం ప్రస్తావిస్తున్నాను.

**జ్ఞానం** కలిగి స్నానం చేయటం ఏమిటి? తుంబురుని కథవల్ల ఏ జ్ఞానం లభిస్తున్నది?

అన్నమాచార్యులవారు ఒక సంకీర్తనలో ఇలా ఆ జ్ఞానాన్ని వివరించి ఉన్నారు.

**మనుజుడై పుట్టి మనుజుల సేవించి**
**అనుదినము దుఃఖమందనేల?**

అనే సంకీర్తనలో చెప్పినట్టు మనుష్యుల్ని సేవించి బాగుపడ్డ వాళ్ళు లేరు. భగవంతుడిని విశ్వసించి సేవించి చెడిన వాళ్ళులేరనే 'జ్ఞానం' కలుగుతుంది. అదే ఆలయదర్శన పరమార్థం. ఈ పరమార్థాన్ని తీర్థస్నానం అనే సంప్రదాయం అందిస్తున్నది. శ్రీవారి కృపావిశేషమే ఇన్ని పుణ్యతీర్థాలలోనూ ప్రసరిస్తున్నది. లోతుగా చూస్తే – దర్శిస్తే – ప్రతి తీర్థగాథవెనుక అనంతమైన ధార్మికస్ఫూర్తి ఉంది.

ఇంకొక తీర్థాన్ని గురించి చెప్పి తీర్థస్నానం బోధించే భగవదుపదేశాన్ని స్మరించుకుందాం.

'కుమారధార' ను గురించిన ఒక కథ ఉంది. ఒక వృద్ధ బ్రాహ్మణుడు వేంకటాచలానికి వచ్చి ఆత్మహత్య చేసుకోవాలని సంకల్పించి గట్టిగా దేవతల్ని, స్వామివారిని పిల్చి తన ఆందోళన వెలిబుచ్చాడు.

స్వామివారు ఒక రాజకుమారుడి వేషంలో వచ్చి "ఆగు! కొండమీది నుంచి దూకవద్దు. ఆత్మహత్య చేసుకోవద్దు. ఈ శరీరాన్ని భగవంతుడు సాధన చేసుకోవటం కోసం ఇచ్చాడు. ఆత్మహత్య మహాపాపం – అని శాస్త్రం. నీకు తెలుసుకదా!' అన్నాడు.

వృద్ధ బ్రాహ్మణుడు ఆగిపోయాడు. స్వామివారు స్వయంగా ఆయనను ఒక తీర్థానికి వెళ్ళి స్నానం చేయించాడు. ఆశ్చర్యం! వెంటనే ఆ ముసలివాడు ముసలితనం పోయి యువకుడు (కుమారుడు) అయ్యాడు. తరువాత ధనవంతుడూ అయ్యాడు. ఆ తీర్థమే 'కుమారధార' అని మార్కండేయపురాణం చెబుతున్నది.

ఇంకో పురాణంలో (స్కాందపురాణంలో) స్కందుడు, అంటే సుబ్రహ్మణ్య స్వామి స్నానం చేశాడు కాబట్టి 'కుమారధారిక' అయిందని కథ ఉంది.



ఏమయినా సుబ్రహ్మణ్యుడు దేవసేనాపతి (స్వామి) అయ్యాడు. తారకాసురుణ్ణి సంహరించాడు.

ఈ పౌరాణిక గాథలవల్ల తెలిసే విషయాలు రెండు ఉన్నాయి : (1) శరీరం భగవంతుడు సాధనకోసం ఇచ్చాడు. (2) ధనాన్ని ధర్మం చేయటంకోసం ఇచ్చాడు – ఈ రెండు బోధల్నీ మనస్సులో ఉంచుకొని పుణ్యతీర్థాలలో స్నానాలు చేయాలి.

చివరగా ఒకమాట చెప్పాలి. ఈవేళ చాలామంది భక్తులకు పుష్కరిణిలో స్నానం ఎలా చేయాలో తెలియదు. బ్రాహ్మణులకు, ముత్తయిదువులకు దక్షిణ తాంబూలాదులు ఇచ్చి, భార్యాభర్తలు (వధూవరులు) స్నానం చేయడానికి ముందు కొంగుముళ్ళు వేసుకొని మూడుసార్లు మునకలు వేయాలి. ఇది 'స్నాననియమ'మని పెద్దలు చెప్పేవారు.

సత్సంతానం కోరేవారు పుష్కరిణిలో ఇలా స్నానంచేసే వారు. చేస్తున్నవారు ఇప్పటికీ లేకపోలేదు. శ్రీవారి దర్శనానికి ముందు పుష్కరిణిలో స్నానాదులు చేసి, వరాహస్వామివారిని దర్శించుకొని తరువాత శ్రీవారి ఆలయాన్ని సమీపించాలి*.

ఇలా ప్రార్థించాలి

---

* సాత్త్వికాహారం (శాకాహారం); మద్యపానాదులకు దూరంగా ఉండటం, బ్రహ్మచర్యం పాటించడం – మొదలైన సాంప్రదాయిక నియమాలను, కట్టుబొట్టులను తి.తి.దే. వారు ఎంతగానో ప్రచారం చేస్తున్నారు. వాటిని అవలంబించే స్వామివారిని దర్శించాలి. శ్రీవైష్ణవ సంప్రదాయంలో పద్మావతి అమ్మవారి 'పురుషకారం' లేనిదే స్వామివారి దర్శనం సఫలం కాదు కాబట్టి తిరుచానూరులో అమ్మవారిని దర్శించిన తరువాతే తిరుమలలో స్వామివారిని చూడాలన్న నియమం ఉంది. ఈ మర్యాదకూడా మనం పాటించాలి.

**అహం దూరతస్తే పదాంభోజయుగ్మ**
**ప్రణామేచ్ఛయాఽఽ ఽ గత్య సేవాం కరోమి**
**సకృత్సేవయా నిత్యసేవాఫలం త్వమ్**
**ప్రయచ్ఛ ప్రయచ్ఛ ప్రభో వేంకటేశ!**

ఓ స్వామీ! వేంకటేశప్రభూ! నీపాద కమలసేవకోసం నేను ఎంతో దూరం నుండి వచ్చాను. సేవ చేస్తున్నాను. ఒకసారి నేను చేసే సేవతోనే నిన్ను నిత్యమూ కొలిస్తే ఇచ్చే ఫలాన్ని దయతో ప్రసాదించు.

ఒకసారి సేవిస్తే స్వామి దయ చూపిస్తాడా! ఈ శ్లోకంలోని 'సకృత్' అనే పదం శ్రీమద్రామాయణంలోని శ్రీరాముని ప్రతిజ్ఞను సూచిస్తుంది. చాలా గొప్ప భగవదనుగ్రహరహస్యం ఈ మాటలో ఉంది.

శ్రీరాముడు తన వద్దకు శరణుకోరి విభీషణుడు రాగా అతనిని అనుగ్రహించాడు. శ్రీరాముడు తన వ్రతాన్ని ఇలా చెబుతాడు.

**సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే**
**అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ.**

ఒక్కసారి నన్ను శరణువేడితే చాలు; నీ వాడిని అని ప్రార్థిస్తే చాలు. సకలభూతరాశినీ కాపాడుతాను. ఇది నా నియమం.

శ్రీనివాసుడూ ఇలాగే కాపాడుతాడన్న విశ్వాసంతో ప్రార్థించాలి.

* * *



అధ్యాయం - 3

# శ్రీవారి అర్చామూర్తి దర్శనం

భగవద్ రామానుజులవారు శ్రీనివాసుని పరతత్త్వంగా భావించి అర్చించారు. శ్రీమన్నారాయణతత్త్వం పరమగుహ్యమైంది. యోగసాధకులు మాత్రమే నిరంతర తపోధ్యాన సమాధులలో గుర్తించదగిన తేజోవైభవమది. అందుకే సృష్టిస్థితి లయలను నిర్వహిస్తున్న పరబ్రహ్మతత్త్వంగా స్వామివారిని కీర్తిస్తూ ఇలా ఆనతి ఇచ్చారు :

**అఖిలభువనజన్మస్థేమ భంగాదిలీలే**
**వినత వివిధభూతవ్రాత రక్షైకదీక్షే**
**శ్రుతిశిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే**
**భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా**

పదునాల్గు భువనాల సృష్టిస్థితిలయలను లీలగా నిర్వహిస్తున్నదీ; శరణుజొచ్చిన సకల భూత సముదాయాన్ని సంరక్షించడంలో దీక్షాబద్ధమైనదీ; వేదాంత ప్రతిపాదితమైన పరబ్రహ్మతత్త్వమైనదీ అయిన శ్రీనివాస పరబ్రహ్మయందలి భక్తి నా 'ప్రజ్ఞ'లో నిరంతరం స్థిరంగా ఉండుగాక!

శ్రీనివాసుడు 'అర్చారూపం' పొంది ఆనందనిలయ విమానంలో దర్శనమిస్తున్నాడు. ఈ అర్చారూపం వెనుక ఆగమశాస్త్ర నేపథ్యం చాలా ఉంది. భగవంతుడు భక్తుడికి సమీపంగా రావటానికే 'విగ్రహ' రూపాన్ని పొంది భక్త సులభుడన్న బిరుదును పొందుతాడు. మనం చేసే అలంకారాలను, సేవలను, సమర్పించే కానుకలను స్వీకరించి, సంతసించి మనల్ని అనుగ్రహిస్తాడు. ఇదే 'అర్చామూర్తి' ప్రయోజనం. ఈ రూపాన్నే ధ్రువ బేరమని, మూలవిరాట్టు అని కూడా పిలుస్తారు. ఇలా శిలా, లోహ, దారు, సుధాది ద్రవ్యాలలో స్వామివారు

ఆవిర్భవించికాని, దేవతలు, ఋషులు మహనీయులు, భక్తులు ఆవహించి చేసికాని పూజించే రూపం; అర్చనకు యోగ్యమైన రూపం అర్చారూపం. ఇక్కడకూడా శ్రీవారి మూలవిరాట్టు అతివిచిత్రమైన దివ్యభూమిక కల్గింది. ఇది స్వయంవ్యక్తం. స్వయంభువు. తనంత తాను ఆవిర్భవించినది. సాలగ్రామ శిలారూపం. కనుకనే శిల్పశాస్త్రాలలోని ఏ మర్యాదలకు లొంగని స్వతంత్ర, ఆకార, రూప, గుణ, ప్రమాణాలు కల్గి శ్రీనివాసుడే శ్రీ వేంకటేశ్వరునిగా శిలారూపంలో ఆవిర్భవించాడని శ్రీ వేంకటాచలమాహాత్మ్యం వివరిస్తున్నది.

స్వామి చతుర్భుజాలతో అర్చారూపాన్ని పొందినాడు. ఇది శ్రీనివాసుని ధ్రువబేరం.

శ్రీమన్నారాయణుడు చతుర్భుజుడు:

**వనమాలీ గదీ శార్ఙ్గీ శంఖీ చక్రీ చ నందకీ**
**శ్రీమన్నారాయణో విష్ణుః వాసుదేవోఽభిరక్షతు**

అని శ్రీవిష్ణు సహస్రనామం వర్ణిస్తోంది. వనమాల (తులసిమాల), కౌమోదకి అనే గద; శార్ఙ్గమనే విల్లు; పాంచజన్యమనే శంఖం; సుదర్శనమనే చక్రం – వీటితో దర్శనమిస్తాడు.

ఈ స్వామికి ఐదు రూపాలున్నాయి. ఐదు రూపాలలో ఈ మహాతత్త్వం వ్యక్తమవుతూ ఉంటుంది.

**1) పరస్వరూపం** : వైకుంఠంలో శేష పర్యంకంపైన శ్రీ భూదేవులలో వేంచేసి ఉండి, అనంత విష్వక్సేన గరుడాదులచేత, ముక్తపురుషుల చేత ఆరాధింపబడుతూ ఉండే నిత్య సత్య స్వరూపమిది.



**2) వ్యూహస్వరూపం** : సృష్టి స్థితిలయలను నిర్వహించడానికి, జీవకోటిని అనుగ్రహించడానికి, ప్రవేశించే రూపాలు – వీటినే విష్ణు, పురుష, సత్య, అచ్యుత, అనిరుద్ధ రూపాలుగా చెబుతారు. ఏమైనా 'విష్ణు' పూజ ఒక 'వ్యూహ' మూర్తిని అర్చించే విధానమే. (బలిచక్రవర్తిని వినయవంతుడుగా చేయటానికి 'వామన' రూపం ధరించటం ఒక వ్యూహమే. విష్ణువు మాయావి – అనటం అందుకే).

**3) విభవస్వరూపం** : దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మసంస్థాపనల కోసం పొందే రూపమిది. శ్రీరామ శ్రీకృష్ణాది అవతారాలు విభవరూపాలే.

**4) అంతర్యామి స్వరూపం** : అంతర్నియంతగా, కేవలం జ్ఞాన గోచరుడై హృదయం కమలకోశంలో భాసమానమయ్యే కాంతిరూపంగా వెలిగే చైతన్యస్వరూపం. యోగులు ధ్యానించే రూపమిదే.

**5) అర్చాస్వరూపము** : ఆశ్రితులకోసం ద్రవ్యాలలో ఆవిర్భవించి, విభవ స్వరూప వైలక్షణ్యం కల్గి, దేశకాలాది నియమాలు లేక, సర్వసహిష్ణువై, అర్చక పరాధీనుడై ఆలయ గృహాదులందు పూజలు అందుకునే రూపమిది.

శ్రీ వేంకటేశ్వరస్వామి వారు అర్చామూర్తిగా కనిపిస్తున్నా – స్వామి వారిచుట్టూ తక్కిన నాలుగు స్వరూపాలూ ఎలా విస్తరించి క్షేత్ర, తీర్థ, పురాణ,

ఇతిహాసరూపాలతో, యోగ, భక్తుల హృదయాలలో వ్యాపించి ఉన్నాయో చూస్తే ఇక్కడ ప్రకాశిస్తున్నది సామాన్యమైన 'మూర్తి' మాత్రం కాదని; విరాడ్రూపమే భక్తులపై వాత్సల్యంతో విగ్రహంలో ఒదిగి ఉందని, కాని దాని ప్రభ, ప్రతిభారూపమైన అంతర్నేత్రానికి నిరంతరం అనుభవంలోకి వస్తూ ఉంటుందని భక్తులందరూ అంగీకరిస్తారు. ఇదే స్వయంవ్యక్తరూపంలోని వైశిష్ట్యం.

"ఈ అర్చా స్వరూపములలో స్వయంవ్యక్తార్చా స్వరూపము బహుతర శక్తియుక్తమై ప్రకాశించుచున్నది. అట్టి స్వయంవ్యక్తార్చాస్వరూపములలో అగ్రస్థానము నలంకరించి బ్రహ్మాండమునందు అద్వితీయముగా ప్రకాశించుచున్నవారు శ్రీశ్రీ వేంకటేశ్వర స్వామివారు" అని పూజ్యులు పండిత వేదాంతం జగన్నాథాచార్యుల వారు వర్ణించి ఉన్నారు. (చూ. శ్రీ వేంకటేశ్వర వైభవము పు. IX, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ).

ఈ వైశిష్ట్యమే పరస్వరూపంలాగా బ్రహ్మాదిదేవతలు రాత్రి సమయంలో అర్చనలు చేస్తారన్న పౌరాణికోక్తి – వ్యూహ స్వరూపంలాగా శ్రీ మహావిష్ణు పూజావిధానమైన వైఖానసం ఆరాధనలో ప్రధానం కావటం – విభవస్వరూపమైన శ్రీనివాసమూర్తి శ్రీరామ శ్రీకృష్ణుల అవతారాల కొనసాగింపు కావటం; అంతర్యామిగా స్వామివారు అన్నివర్గాలవారిని, జాతులవారిని, భాషలవారిని, స్త్రీ పురుష భేదం లేకుండా అందరినీ 'బంధువు'గా పలకరిస్తూ ఉండటం, స్వప్న దర్శనం; ప్రబోధం; తానే నాయకుడుగా ఉంటూ 'మౌనంగా' అన్ని పనులను తానే నిర్వహింప చేసుకొంటూ ఉండటమన్నది ఈ 'తిరుమల' క్షేత్రస్వామికి మాత్రమే చెల్లింది.

అందుకే వేంకటేశా! నిన్ను చూడటానికి రెండు కళ్ళు చాలవు స్వామీ! పదివేల కళ్ళు కావాలి – అన్నారు త్యాగరాజస్వామివారు.



**ప॥ వేంకటేశ నిన్ను సేవింపను పదివేల కన్నులు కావలెనయ్యా!**

**అ॥ప॥ పంకజాక్ష పరిపాలిత మునిజన**
**భావుకమగు దివ్యరూపమునుగొన్న ॥వేం॥**

**చరణం : యోగిహృదయ నీవే గతియని జన**
**భాగధేయ వరభోగీశ శయన**
**భాగవతప్రియ త్యాగరాజనుత**
**నాగాచలముపై బాగుగ నెలకొన్న ॥వేం॥**

త్యాగరాజ స్వామివారు నిరంతరం 'ముని' జనులను సాధు సత్పురుషులను కాపాడటానికే స్వామి తన మహిమల్ని ప్రదర్శించాడన్న గొప్ప భావాన్ని 'పరిపాలిత మునిజన' అన్న ప్రయోగం ద్వారా నిరూపించారు. పరమయోగి హృదయనివాసుడు స్వామి అన్నది గొప్ప సంబోధనం.

శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యులవారు స్వామివారి మూలమూర్తిని చూపగానే పులకరించి ఇలా కీర్తించారు.

**పల్లవి : పొడగంటిమయ్యా మిమ్ము – పురుషోత్తమా మమ్ము**
**నెడయకవయ్యా కోనేటిరాయడా ॥పొ॥**

**చరణం : కోరి మమ్ము నేలినట్టి కులదైవమా చాల**
**నేరిచి పెద్దలిచ్చిన నిధానమా**
**గారవించి దప్పిదీర్చు కాలమేఘమా! మాకు**
**చేరువ చిత్తములోని శ్రీనివాసుడా! ॥పొ॥**

**" భావింప కైవసమైన పారిజాతమా! మమ్ము**
**చేవదీర గాచినట్టి – చింతామణీ**
**కావించి కోరికలిచ్చే – కామధేనువా! మమ్ము**
**తావై రక్షించేటి – ధరణీధరా... ॥పొ॥**

”     **చెడనీక బ్రదికించే - సిద్ధమంత్రమా! రోగా**
**లడచి రక్షించే - దివ్యౌషధమా!**
**బడిబాయక తిరిగే - ప్రాణబంధుడా! మమ్ము**
**గడియించినట్టి శ్రీ వేం-కటనాథుడా ॥పొ॥**

ఆంధ్రదేశంలోనూ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలలోనూ చాలామందికి శ్రీవారు 'కులదైవం'. పరంపరగా (తరతరాలుగా) తాతలు, తండ్రులు పూజిస్తూ రావటం అన్నది శ్రీనివాసుడి విషయంలో ప్రత్యక్షరసత్యం.

అందుకే తెలుగువారి 'ఇలవేల్పుగా' స్వామివారిని కొలుస్తారు. ఆయన మనతో ఒక 'బాంధవ్యం' కల్గిన 'పెద్దాయన'గా మనల్ని పలకరిస్తారు. ఇదే అర్చామూర్చి విషయంలో చెప్పే 'సౌలభ్యం'. ఆయన భక్తవత్సలుడు, ఆయన భక్తుల్ని కాపాడడానికి చివరికి వైకుంఠాన్ని కూడా వదిలి వేస్తానని చెప్పినవాడు.

**వైకుంఠం వా పరిత్యక్ష్యే - న భక్తాంస్త్యక్తుముత్సహే**
**మేఽత్రిప్రియా హి మద్భక్తా - ఇతి సంకల్పవానసి ॥**

అని పురాణోక్తి. నేను వైకుంఠాన్నయినా వదలిపెట్టి ఉంటాను. నా భక్తుల్ని మాత్రం వదలి ఒక క్షణం కూడా ఉండను. నాకు అత్యంత ప్రియులు నా భక్తులే. వారిని రక్షించడమే నా 'సంకల్పం' - అని దీక్ష వహించిన స్వామి మరెక్కడా కనిపించడు. అందుకే స్వామి ఒక్కొక్కరికి ఒక్కో తీరుగా కనిపించి, కవ్వించి, లాలించి, బుజ్జగించి చెప్పినమాట వినకపోతే తల్లిలాగా బుగ్గగిల్లి, వీపుపై చరిచి 'దారి'లో పెడతాడు - అంతే తప్ప వదిలిపెట్టడు. ఈ అనుభూతి స్వామివారిని దర్శించినపుడు కోట్లమంది భక్తులు పొందుతున్నారు. అదే ఎవరికీ అర్థంకాని రహస్యం. అందుకే స్వామివారు పెద్దలిచ్చిన 'నిధానం'. అతిగొప్ప సంపద - స్వామివారిని మా తరువాత కూడా అర్చించండి రా! అని పెద్దలు చెప్పిన మాటే. అందుకే స్వామివారు మూలనున్న 'నిధానం'.



'కాలమేఘం' లా నల్లగా ఉన్నాడు స్వామి. ఈ నల్లదనం శ్రీవారి అవ్యక్త తత్త్వ రహస్య ప్రతీక. భాగవతంలో గోపికలు ఈ 'నల్లని' వాడిని వెదుక్కుంటూనే ఇలా అడిగారు!

**నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబు పై**
**జల్లెడువాడు మౌళిపరిసర్పిత పింఛమువాడు నవ్వు రా**
**జిల్లెడు మోము వాడొకడు చెల్వల మానధనంబు దోచెనో**
**మల్లియలార! మీ పొదల మాటున లేడు గదమ్మ చెప్పరే!**

సరిగా అలనాటి 'నల్లనయ్యే' ఈనాటి శ్రీనివాసుడు. అలాంటి పద్మనయనాలే. కృపారసమూర్తి. నవ్వు రాజిల్లెడు ముఖం అలాగే ఉంది. ప్రపంచంలోని మనుష్యుల రహస్యాల్ని అన్నింటిని దాచుకొని ఉన్నాడు. ఆనాడు కృష్ణుడు చేసిన పనీ అదే కదా!

కాలమేఘం - చక్కగా వర్షాన్ని ఇస్తుంది. స్వామివారు కోరికలు తీర్చి ఆకలిదప్పులు బాపుతాడు. సంపదనిస్తాడు. భక్తినిస్తాడు. చివరికి ముక్తినీ ప్రసాదిస్తాడు. అందుకే ఆయన భక్తపారిజాతం, భక్తచింతామణి, భక్తపారిజాతం- ఈ దివ్యవృక్షాలు కోరిన కోరికలు తీరుస్తాయని పురాణాలలో చెప్పబడ్డాయి.

'సిద్ధమంత్రం' అని స్వామిని సంబోధించడంలో రహస్యముంది. తన భక్తుల వద్దకు ఆయనే స్వయంగా వెళ్ళి మంత్రంగా వారి స్మరణలో స్థిరపడి వారిని ఉద్ధరిస్తాడు. ప్రహ్లాదుడిని గర్భ వైష్ణవుడుగా మార్చింది నారదుడు. బోధించిన 'నారాయణ' మంత్రమే. ఇది ప్రహ్లాదుడు సాధించింది కాదు. జన్మతో ఆ భక్త శిఖామణికి సిద్ధించింది. అలాగే 'వేంకటేశు' మంత్రం - ఏయే భక్తుడి వద్దకు వెళ్ళాలో అక్కడికి వెళ్ళి తీరుతుంది. అందుకే పరమనాస్తికులు కూడా భక్తులై ముక్తినందిన సందర్భాలు ఎన్నో!

ఆయన 'దివ్యౌషధం' - పునర్జన్మ లేకుండా చేసేటువంటి పరమోత్కృష్టమయిన ఔషధమిది. ఒకసారి తీసుకొంటే చాలు. మరో ఔషధం అక్కరలేదు. ఏ క్లిష్టముల దైహిక, మానసిక, ఆధ్యాత్మిక తాపత్రయాదులైనా చప్పున మాయమౌతాయి. అలాంటి 'అమృత' సుధాసముద్రం స్వామివారు.

చివరగా ఆయన 'ప్రాణబంధుడు'. విష్ణు సహస్రనామంలో ఈ రహస్యాన్ని భీష్మలవారు వివరించారు.

**ఆర్తా విషణ్ణా శిథిలాశ్చ భీతాః**
**ఘోరేషు చ వ్యాధిషు వర్తమానాః**
**సంకీర్త్య నారాయణశబ్దమాత్రమ్**
**విముక్తదుఃఖాః సుఖినో భవంతి ॥**

ఆర్తులు, దుఃఖంలో ఉన్నవారు, వార్ధక్యంచేత సడలిన శరీరాలు కలవారు, భయంతో వణకిపోతున్నారు. ఘోరమైన వ్యాధులు గలవారు, నారాయణ శబ్ద ఉచ్చారణచేతనే దుఃఖం పోగొట్టుకొని సుఖులవుతున్నారు.

శ్రీనివాసుని 'ప్రాణబంధు' వని అందుకే అంటారు. ఇలాంటి స్వామిని దర్శిస్తే ఎలా ఉంటుందో ఊహించుకోండి.

**ఆలయదర్శనం**

సంస్కృతంలోని 'దేవాలయం' అనే మాటను తెలుగు భాషలో 'కోవెల' అంటాం. దీన్నే తమిళంలో 'కోయిల్' అని పిలుస్తారు. 'కో' అంటే దేవుడు. ఇల్ – అంటే మందిరం. దైవమందిరమని అర్థం. అందుకే వైష్ణవ మహాభక్తులు శ్రీవారిని ధరించి ఉన్న 'కోయిల్'ను కూడా ఒక 'ఆళువారు'గా (భక్త శిఖామణిగా) భావిస్తారు. ప్రతిరోజు సుగంధద్రవ్య పరిమళాదులతో పరిశుభ్రంగా ఉంచుతారు. కస్తూరి, చందనం, గంధం, పునుగు, జవ్వాది మొదలైన పరిమళద్రవ్యాల



సువాసనలలోపాటు శ్రీవారి వంటశాలనుండి వచ్చే మధురమైన అన్నప్రసాదాల గుబాళింపులతో శ్రీవారి ఆలయం ఒక ఆధ్యాత్మిక ఆనందంతోపాటు 'సుప్రసన్నత'ను 'మాధుర్యాన్ని' మనస్సుకి కల్గిస్తోంది.

తొలుత బయటనుండి కనిపించేది 'మహాద్వార గోపురం'. దీన్నే 'పడికావలి' అంటారు. దేవతలు సైతం ఇక్కడికి వచ్చి స్వామివారి దర్శనంకోసం కాచుకొని ఉంటారు – అంచేత – పడికావలి – అంటారు. దీనిచుట్టూ దట్టమైన ప్రాకారం ఉంది. దీన్ని 'సంపంగి' ప్రాకారమని అంటారు. దీనిలోపల మరో ప్రాకారం ఉంది. దీన్ని 'విమాన' ప్రాకారం అంటారు. దీనిలోపల 'ఆనందనిలయం' గర్భాలయం చుట్టూ ఒక చిన్న ప్రదక్షిణ మార్గం ఉంది. దీన్ని 'చూళిక' అంటారు. ధనుర్మాసంలో శుద్ధ ఏకాదశి ద్వాదశినాడు భక్తులు ఈ మార్గంగుండా (వైకుంఠ ద్వారమని కూడా అంటారు) స్వామికి ప్రదక్షిణంలో వచ్చి ధన్యులవుతారు.

ఇన్నిటినీ దాటి లోపలికి వెళ్తే స్వామివారు దర్శనమిస్తారు. ఈ మధ్యలో కృష్ణరాయ మండపం, రంగనాయక మండపం, అద్దాల మండపం, తిరుమలరాయ మండపం, కల్యాణ మండపం (సంపంగి ప్రాకారంలో), వంటశాల (పడిపోటు), బంగారుబావి (లక్ష్మీతీర్థం), పూలబావి (భూతీర్థం), ధ్వజస్తంభ మండపం, వెండివాకిలి, వరదరాజస్వామి ఆలయం, ఘంటామండపం, గరుడాళ్వారు సన్నిధి, జయవిజయుల విగ్రహాలు – తారసిల్లుతాయి. ప్రతిచోటులోనూ స్వామికి సంబంధించిన ఏదో పురాస్మృతి – మనల్ని తట్టి పలకరిస్తూ ఉంటుంది.

జయవిజయుల పంచలోహ విగ్రహాల నడుమ ఉన్న ప్రధాన ద్వారమే 'బంగారువాకిలి'. దీనిలోపలికిపోగా మొదట 'స్నపన మండపం' దర్శనమిస్తుంది. ఇక్కడే ప్రతిరోజూ భోగ శ్రీనివాసమూర్తికి 'కొలువు' జరుగుతుంది.

దానిలోపలి నడవ 'శ్రీరాములవారి మేడ'. ఇక్కడ ఒకప్పుడు శ్రీ సీతారామలక్ష్మణులు, వారి పరివార విగ్రహాలు ఉండేవట. అందుకే ఈ పేరు వచ్చింది.

దీనిలోపలి నది 'శయనమందిరం'. అంటే గర్భాలయానికి ముందున్న అంతరాళమే ఇది. ఇక్కడే స్వామివారికి రాత్రిపూట 'ఏకాంతసేవ' (పవళింపు సేవ) జరుగుతుంది.

దీని తరువాత 'కులశేఖరప్పడి' (గడప) ఉంది. దాని లోపలున్నదే 'ఆనందనిలయ'మనే పేరున్న శ్రీవారి గర్భాలయం.

**ఆనందనిలయం**

శ్రీవారి దివ్యమంగళ విగ్రహం ఈ గర్భగుడిలో పశ్చిమంవైపు గోడకు సమీపంగా ఉంటుంది. స్వామివారు నిత్యం 'నిలబడి' ఉన్న మూర్తి (స్థానకమూర్తి). స్వామివారిలోని భక్తత్రాణపరాయణతకు, నిత్య సంసిద్ధతకు తార్కాణం ఈ నిలచి ఉండటం. పడుకున్నవాడు, కూర్చుని, లేచి నిలబడాల్సి వస్తుంది. అంత విరామం స్వామికి లేదు. ఎన్నో లక్షలమంది ఆర్తుల విన్నపాలు నిలబడే వింటాడు. అప్పటికప్పుడు వారి సమస్యల్ని పరిష్కరించడానికి ఎవర్ని పురమాయించాలో వారిని పురమాయించడానికి సంసిద్ధంగా త్రేతాయుగంలోని శ్రీరామచంద్రుడిలాగా ధనుర్బాణాలతో సిద్ధంగా ఉన్న విధంగా – దర్శనమిస్తాడు.

ఈ గర్భాలయంలోని మూలమూర్తితోపాటు భోగ శ్రీనివాసమూర్తి, కొలువు శ్రీనివాసమూర్తి. ఉగ్ర శ్రీనివాసమూర్తి, ఉత్సవమూర్తి అయిన మలయప్పస్వామి (శ్రీ భూసమేతుడై), విగ్రహాలతోపాటు, రుక్మిణీ శ్రీకృష్ణుల వెండి విగ్రహాలు, శ్రీ సీతారామలక్ష్మణుల పంచలోహ విగ్రహాలు, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్ పంచలోహమూర్తి; కొన్ని సాలగ్రామాలు కూడా కొలువై నిత్యార్చనలు అందుకుంటున్నాయి.



**మూలవిరాట్టు వర్ణన**

కుడిభుజంపైన చక్రం, ఎడమ భుజంపైన శంఖం, క్రింద కుడిచేయి వరద హస్త ముద్రతో; ఎడమచేయి అభయ హస్త ముద్రతో, 'త్రిభంగి'లో నడుమువద్ద ఒకించుక వంగి, అద్భుతమైన విలాస భంగిమలో స్వామివారు ఆనందమయ కల్యాణమూర్తిగా సాక్షాత్కరిస్తాడు.

శ్రీనివాస గద్యలో శ్రీస్వామివారి దివ్యమంగళ విగ్రహ వర్ణన బహుశోభాయమానంగా గావించబడింది. ఆయన ధరించిన ఆభరణాలు, వనమాల, భుజములు, హస్తాలు, జంఘలు, పాదపద్మాలు మాత్రమే కాకుండా

**"నవీన పరితప్త కార్తస్వర కవచిత మహనీయ పృథుల సాలగ్రామ పరంపరాగుంఫిత నాభి మండల పర్యంత లంబమాన ప్రాలంబదీప్తి విశాలవక్షః స్థలః"** అని వర్ణించబడింది. విశాల వక్షఃస్థలం కలిగి, బంగారులో పొదిగిన సాలగ్రామ హారంతో శోభిల్లేటువంటి ఆ స్వామి నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాది వివిధోత్సవ కృతానందుడు. ఆయన్ని చూడగానే ఆయనకు అలంకరించిన ఆభరణాలు, పూలదండలు, పొడవైన కిరీటం, అతిగంభీరమైన రాజసం తోటి ఆ మూర్తివైభవం మనల్ని కమ్ముకొని నిశ్చేష్టుల్ని చేస్తుంది. ఎవరికీ ఆ విగ్రహంలోని అవయవవిన్యాసంకాని, వక్షఃస్థలంలోని శ్రీ, భూ మూర్తులుకాని, తక్కిన వివరాలు ఏవీ కనిపించవు.

అందుకే శ్రీవారి అర్చామూర్తిని వీలైనంత దగ్గరగా చూద్దాం. అది ఒక 'శుక్రవారం' బ్రాహ్మీముహూర్తంలో జరిగే అభిషేక సందర్భంలోనే సాధ్యం. ఆనాడు అన్నమాచార్యులవారు అభిషేకాన్ని సాంగోపాంగంగా వర్ణించి ఆ స్వామి రూపలావణ్య వైభవాలను ఇలా వివరించి ఉన్నారు.

**ప॥ కంటి శుక్రవారము – గడియలేడింట**
**అంటి అలమేల్మంగ – అండనుండే స్వామిని ॥కంటి॥**

చరణం॥ సొమ్ములన్నీ కడబెట్టి - సొంపుతో గోణము గట్టి
కమ్మని కదంబము - కప్పు పన్నీరు
చెమ్మతోన వేష్టువలు - రొమ్ముతల మొలచుట్టి
తుమ్మెద మైచాయతోన - నెమ్మది నుండే స్వామిని ॥కంటి॥

" పచ్చకప్పురమె నూఱి - పసిడిగిన్నెల నుంచి
తెచ్చి శిరసాదిగ - దిగనలది
అచ్చెరపడి చూడ - అందరి కన్నులకింపై
నిచ్చెమల్లె పూవువలె - నిటు తా నుండే స్వామిని ॥కంటి॥

" తట్టుపునుగే కూరిచి - చట్టలు చేరిచి నిప్పు
పట్టి కరగించి వెండి - పళ్యాల నించి
దట్టముగ మేను నిండ - పట్టించి దిద్ది
బిట్టు వేడుక మురియు - చుండే బిత్తరి స్వామిని ॥కంటి॥

ఆ స్వామిని ఎంత అందంగా దర్శించాడో చూడండి. అభిషేక సమయంలో ఏ ఆభరణాలూ ఉండవు. సొంపుగా స్నానకొపీనం (గోణం) ఒకటి కడతారు. శ్రీవారి ఊర్ధ్వపుండ్రంలో అర్ధభాగం తగ్గించి సూక్ష్మంగా ఊర్ధ్వపుండ్రాన్ని ఉంచుతారు. అఖండ దీపాల వెలుగులో స్వామివారి అచ్చపు రూపాన్ని చూచిన భక్తులకు శ్రీనివాసుని గాంచి ముగ్ధురాలైన వకుళమాలిక గుర్తుకు రాకపోదు. లేదా వారే యశోదలు, వకుళమాలికలు అయిపోతారు. అందరూ పరమాత్ముడనే దివ్యకాంతి వలయంలో ప్రవేశించిన చిరుదీపాల్లాగా మారిపోతారు. ఆ అందం ఏమని వర్ణించగలం! అలంకారాల చేత స్వామివారు అందంగా కనిపిస్తాడన్న భావన సంపూర్ణంగా తప్పు - అని తెలిసిపోతుంది. ఆ అలంకారాలు స్వామివారి దివ్యదేహం మీద ఉండటంవల్ల వాటి పుట్టుకలు సార్థకాలయ్యాయనిపిస్తుంది. 25 సంవత్సరాల యువకుడు, వివాహానికి సిద్ధంగా



ఉన్న నిత్య పెండ్లికొడుకైన ఒక ఆజానుబాహువు, విశాల వక్షఃస్థలం కల్గినవాడు, విశాలమైన నుదురు, అందమైన చెక్కిళ్ళు, పొడవాటి చెవులు, కోటేరు వేసినట్టున్న ముక్కు, చిరునవ్వు చిందిస్తూ గంభీరంగా ఉన్న నోరు, భక్తులకు ఆర్తిగా అక్కున చేర్చుకొనే విశాలబాహువులు, అభయ, వరద హస్తాలు, వక్షఃస్థలంమీద నిరంతరం విహరించే వ్యూహలక్ష్మి (ఈమే శ్రీదేవి - ఈమె నివసిస్తుంది కాబట్టే శ్రీనివాసుడయ్యాడు). బలిష్ఠమైన జంఘలు, నడుము దగ్గర చిన్న వంపు (బాలకృష్ణుడిని పోలిన నృత్యభంగిమ), అతిలోకమైన దయామృత తరంగాలు విరజిమ్మే పాదారవిందాలు, క్రిందనున్న పద్మపీఠం - అన్నింటినీ చూసి భక్తులు ఒక సమ్మోహనాన్ని పొందుతారు. అందరి చేతులు నమస్కరిస్తూ, కళ్ళు మూసుకుపోతాయి. బాహ్యప్రపంచస్పృహ ఉండదు.

ఇంతలో అభిషేకం ప్రారంభమవుతుంది. తన ఎదలోనున్న లక్ష్మీతాయారుకు శుక్రవారం ముఖ్యం కాబట్టి - ఆ తల్లికి తనకు ఆనాడే అభిషేకం జరగటం స్వామివారికి చాలా ఇష్టం. అభిషేక సమయం శ్రీవారి ఆలయంలో చాలా ప్రధానమైనది. జియ్యంగార్లు, ఆలయ అధికారగణం, ఏకాంగులు, పరిచారకులు, ఆచార్య పురుషులు (అర్చకస్వాములు) అందరూ చేరి అభిషేకంలో పాల్గొంటారు. పరిమళం అరనుండి రజత పాత్రలలో శ్రీవారి ఊర్ధ్వపుండ్రంకోసం సిద్ధం చేయబడిన పచ్చకర్పూరం, కస్తూరి స్వీకరించి తెస్తారు. అధికారులు కుంకుమపువ్వు నలుగు బిళ్ళలు, చందనపు బిళ్ళలు, పసుపు కల్గిన రజతపాత్రలు తెస్తారు. పరిచారకులు పచ్చకర్పూరం, కుంకుమ పువ్వు పునుగు చందనాలలో మిశ్రితమైన 'పరిమళం' అనే సుగంధ ద్రవ్యాన్ని తీసుకువస్తారు.

వీరందరూ చేరాక శ్రీలక్ష్మీ సమాశ్లిష్ట భుజాంతరుడైన శ్రీవారి అభిషేకం ప్రారంభమవుతుంది. తొలుత అర్చకుడు 'ఉష్ణీషం' (తలకు పాగావంటిది) కట్టుకొని తొలుత అమ్మవారికి, స్వామివారికి నమస్కరించి ముందుగా ఆకాశగంగా జలంతో పూరింపబడ్డ సువర్ణ శంఖంతో - వెనుక వేదపండితులు

పంచసూక్తులు పారాయణం చేస్తుండగా స్వామివారి పరత్వ సూచకమైన కిరీటంపైన అభిషేక ప్రక్రియను ప్రారంభిస్తాడు. తరువాత రెండు గంగాళాల గోక్షీరంతో; రెండు గంగాళాల బంగారు బావి ఉదకాలతో స్వామివారికి దాదాపు ఒక గంటసేపు వైఖానస ఆగమోక్త విధానంతో అత్యద్భుతంగా అభిషేకం జరుగుతుంది.

తరువాత 'పరిమళ' ద్రవ్యం తీసుకొని శ్రీవారి పాదాల నుండి కిరీటం వరకు అత్యంత ఆదరంతో పూసి నలుగు పెడతారు.

ఆ పిమ్మట శ్రీవారి వక్షఃస్థల లక్ష్మికి హరిద్రాభిషేకం జరుగుతుంది (పసుపు అమ్మవారికి చాలా ముఖ్యమైన సుమంగళీ ద్రవ్యం). తరువాత మరలా శుద్ధోదక స్నానం జరుపుతారు. ఈ తీర్థాన్ని భక్తులపై 'పూతో భవ' అని అర్చక స్వాములు చల్లుతారు.

అప్పటికి వేదపారాయణ పూర్తి అయి, జియ్యంగార్లు అధ్యాపకులు ద్రావిడవేదం నీరాట్టం 10 పాశురాలను అనుసంధానం చేస్తారు.

ఈ సమయంలో యవనిక (తెర) ను వేసి, ప్లోతవస్త్రం (తడి తుడిచే వస్త్రం)తో; స్వామివారి 'స్నానశాటిని' తొలగించి; శ్రీవారి దివ్యదేహాన్ని ఎక్కడా తడిలేకుండా సుకుమారంగా తుడుస్తారు. శ్రీవారి శిరస్సుకు ఒక పొడి వస్త్రం చుట్టుతారు. దానిపై కిరీటం పెట్టడానికి అనుకూలంగా స్వామివారి శిరస్సుకు బాధ కలగకుండా ఉండటానికి ఇలా కడతారు. జియ్యంగార్లు ఆలవట్టంతో (విసనకర్ర – పట్టుది) విసురుతుండగా అర్చక స్వాములు 24 మూరల సరిగ పట్టంచు ధోవతిని అతిరమణీయంగా ధరింపజేస్తారు. 12 మూరల ఉత్తరీయాన్ని వల్లెవాటుగా వేస్తారు. పచ్చకర్పూరం, కస్తూరిని గ్రహించి శ్రీవారి తిరుముఖ మండలం కాంతులు చిమ్మేవిధంగా యథాప్రమాణంగా 'నీలతిరుమణికాపు' (ఊర్ధ్వపుండ్రం) తీర్చిదిద్దుతారు.



అప్పటికి దివ్యప్రబంధగానం పూర్తి అవుతుంది. స్వామివారికి గోనవనీతం (వెన్న), పంచదార నివేదనం చేసి; ముఖవాసం (తాంబూలం) సమర్పిస్తారు. బంగారు నీరాజన పాత్రలో స్వామివారికి పచ్చకర్పూర హారతిని చేస్తూ తెరతీస్తారు.

ఇంతసేపు నిరీక్షించిన భక్తుల హృదయాలు స్వామివారి దివ్యదర్శనంతో పులకరింత పొందుతాయి. ఒకవైపు మైమరపు, మరోవైపు ఆనందం, మరోవైపు ఇంకా ఏదో దర్శించాలన్న ఔత్సుక్యం – పెనవేసుకోగా, శ్రీవారి స్వతస్సిద్ధ దివ్య సౌందర్య సన్నివేశాపహృత చేతస్కులై దేవత్వాన్ని పొందిన వారిలాగా రెప్పలను వాల్చకుండా, తదేకధ్యానంగా ఉద్గ్రీవులై (నిక్కించిన మెడలు గలవారై) శ్రీవారిని దర్శిస్తూ ఉంటారు. శ్రీ స్వామివారి దర్శనంలోని అమృత భావానుభూతిని పొంది ధన్యులయ్యామని భక్తులు తీర్థం గ్రహించి బయటికి వస్తారు.

**అలంకారసేవ – అమూల్యమైన ఆభరణాలు**

'కంటి కంటి నిలువు చక్కని మేనుదండము' అనే సంకీర్తనలో అన్నమయ్య స్వామివారి ఆభరణాలను వర్ణించారు.

ఈ ఆభరణాలను, వస్త్రాలను గురించి శ్రీయుతులు పి.వి.ఆర్.కె. ప్రసాద్ గారు (తిరుమల లీలామృతం)లో రాసిన కొన్ని విషయాలు చాలా ముఖ్యమైనవి.

"తోమాల అయినా, అర్చన అయినా చూడగలిగింది ముఖ్యంగా స్వామివారికి సమర్పించిన అలంకార నగలనే... గురు, శుక్రవారాల్లో కొన్ని గంటలు తప్ప వారంలో ఎప్పుడైనా చూడగలిగింది స్వామివారి ముఖం మాత్రమే... అది కూడా పూర్తిగా కాదు. కర్పూరనామం, స్వామివారి కళ్ళు, ఫాలభాగం కప్పివేస్తే, ముఖంలో కొద్దిమాత్రమే చూడగలరు. మిగతా విగ్రహం పాదాలతో సహా పూర్తిగా నగలతో పట్టువస్త్రాలతో కప్పబడి ఉంటుంది" (పు. 13).

ఇలా స్వామివారి దర్శనంలో ప్రధానమైనవి ఆభరణాలే. వీటిని గురించి చాలామందికి తెలీదు కాబట్టి కొన్ని వివరాలు చూద్దాం.

సువర్ణపద్మ పీఠం, సువర్ణపాదాలు, నూపురములు (చిరుగజ్జెలతోటి) పాగడాలు, కాంచీగుణం (మొలనూలు); ఉదరబంధం (నాగఫణంతోటి ఒడ్డాణం); దశావతార రశన (దశావతార ప్రతిమలతోటి చిరుగంటల మొలత్రాడు); చిన్న-పెద్ద కంఠాభరణాలు; బంగారు పులిగోరు హారము; గోపుహారం (నాభి పర్యంతం 5 పేటల హారం); సువర్ణ యజ్ఞోపవీతం; సాధారణ యజ్ఞోపవీతం; తులసీపత్రహారం; చతుర్భుజలక్ష్మీహారం; అష్టోత్తర శతనామసరం; సహస్రనామహారం; సూర్యకఠారి; వైకుంఠ, కటిహస్తాలు; కడియాలు; నాగాభరణాలు; భుజకీర్తులు, కర్ణపత్రాలు, చక్రశంఖాలు; కిరీటం – ఈ నగలు ప్రతిరోజూ అలంకరిస్తారు.

విశేష దినములలో రత్నకిరీటం, మేరుపచ్చ, రత్నాభరణాలు, మకరకంఠి; సువర్ణ పీతాంబరం; శుక్రవారంనాడు ఈ అలంకారాలు స్వామివారికి చేసిన తరువాత శ్రీసూక్తంతో భూసూక్తంతో స్వామివారి వక్షఃస్థల లక్ష్మికి, భూదేవికి (కుడి ఎడమలనున్న) ఆరాధన జరుగుతుంది.

దీన్నిబట్టి స్వామివారిలోని రామణీయక లక్షణం అమ్మవార్ల శోభవల్ల వచ్చినదేనని; శ్రీభూసమేతులైన శ్రీ వేంకటేశ్వర స్వామివారు జగత్కుటుంబిగా ఆనందనిలయంలో వెలిసి ఉన్నాడని గుర్తించాలి. ఆయన పరివారమే ఈ జగత్తంతా. ఈ పరివారంకోసం ఆయన ఆలయం వెలుపల అంగీకరించే వేడుకలే ఉత్సవాలు.

* * *



అధ్యాయం - 4

# ఉత్సవ దర్శనం

శ్రీవారు నిత్యోత్సవప్రియుడు. ప్రతిరోజూ స్వామివారి ఆలయం నిత్యకల్యాణం – పచ్చుతోరణంగా ఒక కల్యాణశోభను సంతరించుకొని విరాజిల్లుతూ ఉంటుంది. భక్తరక్షణోత్సుకుడైన స్వామివారు పామరులమైన మనం ఎలా అలంకరించినా, ఏం సమర్పించినా సంతోషంతో స్వీకరించి మనల్ని అనుగ్రహిస్తారు. అందుకే ఆలయంలో ప్రతిరోజూ మూలవర్లకు ఏదో ఒక విశేష సేవ జరుగుతూ ఉండగా; ప్రతిరోజూ ఏదో ఒక ఉత్సవం కూడా జరుగుతూ ఉంటుంది.

ఈ ఉత్సవాలను అందుకునే విగ్రహాలను ఉత్సవమూర్తులని అంటాం. ఈ స్వామికి ఒక ప్రత్యేకమైన పేరుంది. 'మలయప్పస్వామి' అని వీరికి పేరు. వీరికే అన్ని ఉత్సవాదులూ జరుపుతారు.

వీటిలో విశేషంగా చెప్పదగినది ప్రతిరోజూ జరిగే కల్యాణోత్సవం. శ్రీనివాసుడి అవతారం పద్మావతీ కల్యాణ ప్రయోజనం కల్గింది కావటంవల్ల శ్రీనివాసుడు కల్యాణమూర్తిగానే జగత్ప్రసిద్ధుడయ్యాడు. తమ పిల్లలకు 'కల్యాణం' కావాలని ముడుపుకట్టి స్వామివారికి కల్యాణోత్సవం చేయిస్తారు. ఈవాళ శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ఏర్పడిన తరువాత ప్రపంచమంతటా ఈ కల్యాణోత్సవ 'దర్శనం' ప్రతి ఇంట్లోనూ జరుగుతోంది. వైదికమైన వైఖానస శాస్త్ర విధానంతో హోమపూర్వకంగా; అంకురార్పణ మహాసంకల్పం దీక్షాకంకణధారణ, తెరపట్టడం, కన్యాదానం, మంగళసూత్రధారణ, లాజహోమాదులు, చివరికి అక్షతారోపణలు జరుగుతాయి. నడుమ గోదాదేవి శ్రీరంగని వివాహమాడిన సందర్భాన్ని సూచించే 'వారణమాయిరం' అనే గోదాదేవి విరచిత పాశురాల్ని

పఠిస్తూ కొబ్బరికాయల్ని ఎదురెదురుగా దొర్లించే ఒక ద్రావిడ వైష్ణవ సంప్రదాయాచరణ కూడా ఉంది.

చిత్రం ఏమిటంటే దాదాపు 3 గంటలసేపు శ్రీ స్వామివారిని, అమ్మవార్లను కళ్ళార్పకుండా చూస్తూ తమ పిల్లలకు పెళ్ళిళ్ళు అయిన సంబరాన్ని పొందే వందలాది దంపతుల్ని చూస్తే చాలా ముచ్చటగా ఉంటుంది. వైదిక మతం మనది. ఈ మతం ఒక ధార్మిక జీవనాన్ని త్రికరణశుద్ధిగా నడపడానికి సంబంధించింది. ఈ జీవనంలో ప్రధానమైనది వివాహబంధం – దానివల్ల సిద్ధించే దాంపత్య ధర్మం. శ్రీవారి కల్యాణోత్సవం ఈ రెండు ధర్మాల్నీ బోధిస్తాయి.

అందుకే స్వామివారి సేవలను భార్య – భర్త ఇరువురు కలిసి నిర్వహించాలన్న నియమం శ్రీవారి ఆలయంలో ఉంది. అందుకే సేవాకర్తలను 'ఉభయదారులు' అంటారు. ఉభయులంటే దంపతులని అర్థం. ఈ ఉత్సవం ద్వారా శ్రీవారు అమ్మవార్లతో కలిసి పటిష్ఠమైన హైందవ కల్యాణ సంస్కృతిని ప్రచారం చేస్తున్నారని మనం అర్థం చేసుకోవాలి.

అంతేకాదు, శ్రీస్వామివారు యజమానిగా ఉదయం మొదలు తనకు అర్చనాదులు చేసే అర్చక పరిచారకులకు తగిన సత్కారాలు చేస్తూ ఉంటారు. ఇది చాలామందికి తెలియదు.

ఉదయం కొలువు కాగానే శ్రీవారిపక్షాన అర్చకునికి ఫలతాంబూల దక్షిణాదుల్ని, తండులాలను (బియ్యం) దానంగా ఇస్తారు. అర్చకస్వామి దానాన్ని ప్రతిగ్రహించి శ్రీస్వామివారికి 'నిత్యైశ్వర్యో భవ' అని మంగళాశాసనం చేస్తూ పాదాబ్జాలకు నమస్కరిస్తాడు.

అలాగే కల్యాణోత్సవం, ఇతర ఆస్థానాలు జరిపినపుడు కూడా అర్చకులకు 'ఆస్థానమర్యాద' ఫలతాంబూల దక్షిణాది రూపంలో స్వామివారి పక్షాన ఇస్తారు. ఇదే స్వామివారు నిలుపుతున్న యజమాని ధర్మం. ఆయా సేవల్ని మనం



దర్శించినపుడు ఉత్సవాలలో పాల్గొన్నపుడు మనం హైందవ ధార్మిక జీవితంలోని ఈ ధర్మసూక్ష్మాలను గుర్తించాలి.

ప్రాచీనకాలంలో విష్ణుచిత్తులవారు తమ తనయ గోదాదేవిని శ్రీరంగేశ్వరునికిచ్చి మామగారై 'పల్లాండు పల్లాండు పల్లాయి రిత్తాండు పలుకోడి నూరాయిరమ్' అని ఆశీర్వదించారు. (స్వామీ! నీవు ఎన్నో కోట్ల వందల సంవత్సరాలు ఇలాగే ఐశ్వర్యయుక్తుడవై వెలగాలని మా మంగళాశాసనం అని అర్థం). సరిగా అన్నమాచార్యుల వారు కూడా తామే అమ్మవార్ల పక్షాన పుట్టినింటి మర్యాద నడుపుతూ శ్రీవారి కల్యాణోత్సవాలను ప్రారంభించారని చరిత్ర చెబుతున్నది. అన్నమయ్య వంశీయులు ఇప్పటికీ ఈ కైంకర్యాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంలో శ్రీవారియాత్ర – క్షేత్రనివాసం – దర్శనం – సేవ – ఇవన్నీ స్వామివారితో 'బంధుత్వం' పెంచుకోవటానికే అన్న పరమార్థాన్ని గుర్తిస్తే చాలు. స్వామివద్ద మనం సంపాదించడానికి రాకూడదు. స్వామివారికి మనకున్నది నివేదించడానికి రావాలి. తాళ్ళపాక వంశీయులు చేసినది 'సేవ'. శ్రీకృష్ణదేవరాయలు చేసినది 'సేవ'. అందుకే ఇంత వైభవోన్నతమైన ఆలయ ఉత్సవ సంప్రదాయాలు ఏర్పడ్డాయి. ఈనాటికీ కొనసాగుతున్నాయి.

'కల్యాణం' తో ముడిపడిన వసంతోత్సవం, డోలోత్సవం, ఊంజల్‌సేవ, ప్రణయకలహోత్సవం, పల్లకిలో ఊరేగటం, ఏకాంతసేవ – ఇత్యాదులన్నీ నూత్న వధూవరులకు చేసే మర్యాదలే. అందుకే జగద్భర్త అయిన శ్రీనివాసునికి సార్థకంగా 'శ్రీవారు' అని పేరు స్థిరపడింది. ఆయన ఒకడే పురుషుడు. తక్కిన సృష్టిలోని మనమంతా స్త్రీప్రాయులమే. ఈ దృష్టితోనే స్వామివారి సేవను మనం చేయాలి. కర్త – భోక్త జనార్దనుడు ఒకడే. సకల సృష్టి ఆయనకు భోగ్యవస్తువు. అలాగే చరాచర జగత్తు ఆయనకు క్రీడాస్థలమే. మనం వారిచేతిలోని

ఆటబొమ్మలం – అనే భావనతో స్వామివారి మహామహిమను అవగాహన చేసుకోవాలి. అందుకు ఏర్పడ్డవే బ్రహ్మోత్సవాలు.

**బ్రహ్మోత్సవదర్శనం**

శ్రీనివాసునికి బ్రహ్మదేవుడే తొలుత ఉత్సవాలు నిర్వహించాడని కొన్నివేల సంవత్సరాల నుండి ఈ ఉత్సవాలు జరుగుతూ ఉన్నాయని పురాణ కథనం.

ప్రతి సంవత్సరం శరన్నవరాత్రులలో (కన్యామాసమని ఆగమోక్తి) శ్రవణ నక్షత్రానికి 'చక్రస్నానం' అయ్యేవిధంగా నవాహ్నికమైన (తొమ్మిదిరోజులు) బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు.

ఈ బ్రహ్మోత్సవాలను రాజులు, పాళెగార్లు, ఎంతోమంది ధనవంతులు పూర్వకాలంలో నిర్వహించేవారని – ఈనాడు ఆలయసంస్థ వారే ఈ ఉత్సవాలు జరుపుతున్నారని చరిత్రనుబట్టి మనకు తెలుస్తోంది.

పూర్వకాలంలో క్షేత్రదర్శనానికి 'ఆదరబాదర'గా వచ్చి పోయేవారు కాదు. ధనవంతులయినా పేదవారయినా శ్రీ స్వామిసేవను నింపాదిగా చేసేవారు. ఎడ్లబళ్ళలో ధాన్యం మూటలతో తక్కిన సామగ్రితోవెళ్ళి అక్కడే కొన్నిరోజులుండి యథావిధిగా తమ తమ ఆచార సంప్రదాయాలను బోధించే గురువులను సమాశ్రయించి (అందుకే ఆయా శాఖలవారి మఠాలు వచ్చాయి) వారి వారి సంప్రదాయానుసారం స్వామిని శాస్త్రం బోధించిన రీతిగా సేవించి వచ్చేవారు. జియ్యంగార్లను, అర్చకస్వాములను, పరిచారకులను దైవప్రతినిధులుగా గౌరవించడంతోపాటు, వారి అనుజ్ఞతోనే తిరుమల కొండ దిగి వచ్చేవారు. అర్చకుడు శ్రీహరికి ప్రతిరూపం – నడిచే దేవుడు అర్చకుడని అర్థం. అలా ఉన్న రోజులలో ఒక్కోరోజు ఒక్కో వాహనసేవను ఉభయదారులుగా నిర్వహించేవారని – కాలక్రమంలో అన్నమయ్యగారి కాలానికే బ్రహ్మోత్సవాలు బహువైభవంగా జరుగుతూ ఉండేవని – **'ఎండకాని, వానకాని ఏమైనా కానీ,**



**కొండలరాయుడే మా కులదైవమ'**ని ఎన్నో వేలమంది భక్తులు వచ్చేవారని తెలుస్తోంది.

తాళ్ళపాక అన్నమయ్య ఒక సంకీర్తనలో బ్రహ్మోత్సవాలలో జరిగే వాహన సేవలను వర్ణించి ఉన్నారు:

ప॥ **తిరువీధుల మెరిసీ – దేవదేవుడు**
**గరిమల మించిన సిం – గారములతోడను ॥తిరు॥**

**చరణాలు ॥ తిరుదండెలపై నేగె – దేవుడిదె తొలినాడు**
**సిరుల రెండవనాడు – శేషునిమీద**
**మురిపేన మూడోనాడు – ముత్యాలపందిరి క్రింద**
**పోరి నాలుగోనాడు – పువ్వుకోవిలలోను ॥తిరు॥**

” **గక్కన ఐదవనాడు – గరుడునిమీద**
**ఎక్కెను ఆరవనాడు – ఏనుగుమీద**
**చొక్కమై ఏడవనాడు – సూర్యప్రభలోనను**
**ఇక్కువ తేరును గుర్ర – మెనిమిదోనాడు ॥తిరు॥**

” **కనకపుటందలము – కదిసి తొమిదోనాడు**
**పెనచి పదోనాడు – పెండ్లి పీట**
**ఎనసి శ్రీవేంటేశు – డింతి అలమేల్మంగతో**
**వనితలనడుమను – వాహనాల మీదను ॥తిరు॥**

ఈ వాహనాలు కొద్దిపాటి తేడాలతో ఈ రోజుకీ ఇలాగే జరుగుతున్నాయి. పదవనాడు 'కల్యాణోత్సవం' మాత్రం లేదు. 'చక్రస్నానం' ఉంది. గరుడ ధ్వజారోహణంతో మొదలై చక్రస్నానంతో పూర్తి అయ్యే ఈ ఉత్సవాలలో పాల్గొన్న భక్తులు ఆయా యుగాలలో ఆయా దేవతల మధ్య విహరించిన అనుభూతి

పొందుతారు. ప్రతి వాహనం వెనుక శ్రీవారి లీలలు గోచరిస్తాయి. మహావిష్ణు వైభవం కన్నులకు కట్టినట్టు అనుభవంలోకి వస్తుంది.

ఒక విషయం ప్రధానంగా మనం తెలుసుకోవాలి. శ్రీనివాసుడు రాజాధిరాజు. చక్రవర్తి. అందుకే సర్వభూపాలురూ ఆయన పల్లకిని మోసినవారే. అలా ఏర్పడిందే సర్వభూపాల వాహనం. రాజులు మనుష్యులకే ప్రభువులు. ఆ రాజులను సృష్టించి వారి భాగ్యరేఖల్ని త్రిప్పే మరోమహారాజున్నాడు. ఆయనే శ్రీ వేంకటేశ్వర స్వామివారు.

**పాత్రదానోత్సవ ప్రథిత వేంకటరాయ**
**ధాత్రీశ కామితార్థప్రదాయ**
**గోత్రభిన్మణిరుచిరగాత్రాయ**
**రవిచంద్రనేత్రాయ శేషాద్రినిలయాయ తే నమో ॥**
**(నారాయణాయ నమో)**

ఎవరెవరికి ఏది ప్రసాదించాలో అది ప్రసాదించటమే పాత్ర దానోత్సవం. బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ప్రతివారికి శ్రీవారి కృప ఇలా కల్గుతుంది. ఎన్ని కోట్లమంది స్వామివల్ల ఇలా 'జీవిత వైభవ'మనే దానాన్ని పొందుతున్నారో ఊహించండి. మన వైభవం మనది కాదు. శ్రీవారు మనకు ప్రసాదించిందే. దాన్ని మరలా స్వామికే సమర్పిస్తాం. అందుకే ధాత్రీశులు (మహారాజులు) కూడా స్వామినే కోరికలు కోరుతారట. ఆ స్వామి కరుణకోసం శ్రీకృష్ణదేవరాయల వారు సతులతో వినమ్ర శిరస్కులై నమస్కార హస్తాలతో నిలబడినట్టు ఆలయ పడికావలిలో కాచుకొని ఉంటారు.

ఏడుసార్లు వెంటవెంటనే శ్రీవారిని దర్శించుకొని అనేక సువర్ణమయములైన కానుకలు, ధనరాశులు తులాభారంగా సమర్పించినటువంటి శ్రీకృష్ణదేవరాయలు తాను ఈ సేవలు చేస్తున్నానని ఒక శాసనంలో కూడా చెప్పలేదు.



'సమర్పిసలు చిత్తస్థరాదరు' (సమర్పించడానికి సంకల్పించుకొన్నారు) అని మాత్రమే శాసనాలలో ఉంది. అలాగే క్షేత్రయాత్రలు కూడా మనం చేసేవి కావు. మన సంకల్పం మంచిదయితే స్వామివారే తగిన ఏర్పాట్లు చేసి పిచ్చుక కాలికి దారంకట్టి లాగినవిధంగా తన భక్తుల్ని తనవద్దకి లాక్కుంటారు. సేవలు చేయించుకొంటారు. అపారమైన కృపను వారిపై వర్షిస్తారు. అలాగే శ్రీవారిని సేవించిన ఫలంగానే రాయలవారు శాశ్వతంగా సత్కీర్తినిపొంది శ్రీవారి ఆలయంలోని పరివారమయ్యారు. ఆయన చేసిన సేవకు ఆ ఫలాన్ని శ్రీనివాసుడు అనుగ్రహించాడు.

అందువల్ల 'ఉత్సవదర్శనం' – చివర ఒకసారి మరలా సమీక్షించుకొంటే – గుడిలోని స్వామివారు భక్తులకు కనిపించడానికే ఉత్సవాలరూపంలో బయటికి వస్తారు – అన్నది పరమార్థం.

అందుకే పెద్దలంటారు : 'It is not the darshan you get : it is the darshan he gives' అని – దర్శించుకొంటున్నది మనం కాము. ఆయన మనపైన దయతో దర్శనమిస్తున్నాడు అని అర్థం. ఈ భావనతో మనిషికి 'వినయం' ఏర్పడుతుంది. వినయశీలుడే ధర్మాన్ని ఆచరించగలడు.

**శ్రీ 'పద్మావతీ' అమ్మవారి దర్శనంతోనే 'యాత్ర' పూర్తి అవుతుంది**

ఈనాడు మనం తిరుచానూరులో దర్శించే అమ్మవారిని పద్మావతీదేవి అని పిలుస్తాం. పద్మపురాణాన్ని అనుసరించి లక్ష్మీదేవి తన రెండు రూపాలను కలియుగంలో ప్రకటించింది. ఒకటి 'వ్యూహలక్ష్మి'గా శ్రీవారి వక్షఃస్థలంపైన ఉండగా, మరొకటి 'వీరలక్ష్మి'గా తిరుచానూరులో విరాజిల్లుతూ ఉంది.

ఎవరికి 'సంపద' ఇస్తుందో వ్యూహలక్ష్మీదేవి శ్రీనివాసునితో స్వయంగా ఇలా సెలవిచ్చింది.

**"ధన్యాత్మ! నీ తోడ దబ్బుఆడగరాదు**
**చెప్పెద నిప్పుడే సిద్ధముగను**
**మహియందు దానధర్మపరోపకారముల్**
**చేసి నీ కర్పణసేయుచున్న**
**వారికి ధనధాన్యవరసంపదలనిత్తు**
**నందులో లోభపాపాత్ములైన**
**నరుల ధనంబులు నానాట నశియింప**
**జేయుదు, నదివృద్ధి జేయను"**

అని స్పష్టంగా అమ్మవారు చెప్పారు. అందుకే ధార్మికంగా చేసిన సంపాదనలోనే స్వామివారికి 'కానుకలు' సమర్పించాలి. అప్పుడే మన సంపదను అమ్మవారు వృద్ధి చేస్తారు.

'వీరలక్ష్మి' అంటే శ్రీవారిని (మహావీరుడు - జగత్పాలకుడు) హృదయంలో నిల్పుకొన్న లక్ష్మి అని పురాణం చెబుతున్నది. అంచేతనే స్వామికి దీటుగా చతుర్భుజాలతో, మహాగంభీరమైన మూర్తితో జగన్మాతగా అమ్మ 'తిరుచానూరు'లో పాంచరాత్రాగమం ప్రకారం సేవలందుకొంటూ ప్రకాశిస్తోంది. అందుకే తప్పక అమ్మవారిని దర్శించుకొని తిరుమల యాత్రను సఫలం చేసుకోండి.

* * *



అధ్యాయం - 5

# దర్శన సాఫల్యం

శ్రీవారి దర్శనం ఎప్పుడు సఫలమవుతుందంటే స్వామివారి అనుగ్రహాన్ని పొందటానికి తగినరీతిలో శరీరాన్ని, మనస్సును స్వాధీనంలో ఉంచుకొని ప్రశాంత హృదయంతో స్వామివారి సేవ చేసినప్పుడు. పుణ్యం సంపాదించడానికి స్వామివారిని దర్శించాలి తప్పా మరింత పాపం మూటకట్టుకోవడానికి కాదు.

ఈనాటి మనిషి స్వభావంలో 'కలి' లక్షణం సంపూర్ణంగా ఉంది. అందుకే దీన్ని కలియుగమన్నారు. కలియుగంలోని మానవులు ఎలాంటివారో శ్రీమద్భాగవతంలో ఉంది:

**చ॥ అలసులు మందబుద్ధిబలు లల్పతరాయువు లుగ్రరోగ సం**
**కలితులు మందభాగ్యులు సుకర్మము లెవ్వియుఁ జేయఁజాలరీ**
**కలియుగమందు మానవులు కావున నెయ్యది సర్వసౌఖ్యమై**
**యలవడు నేమిటం బొడము నాత్మకు శాంతి మునీంద్ర చెప్పవే**
**(1-44)**

కలియుగంలో మనుష్యులు అలస స్వభావం కలవారు. అంటే సోమరులు అని అర్థం, మందబుద్ధి బలులు - మందబుద్ధులు - మందబలులు. బుద్ధిలోనూ స్థూలత్వమే. బలంలోనూ స్థూలత్వమే - అంటే కండబలమున్నంతగా బుద్ధి నైశిత్యం కూడిన దైహిక ధృతిలేనివారని అర్థం. అల్పతరాయువులు - మునుపటి యుగాల్లోలాగా వందల సంవత్సరాలు బ్రతికేవారు లేరు. ఇన్ని వైద్యసదుపాయలతో కూడా 80 ఏళ్ళు బ్రతకటం గగనంగా ఉంది. ఇలాగే ఉగ్రరోగ సంకలితులు - భయంకరమైన రోగాలు చుట్టూ ముసురుకుంటున్న సమయమిది. పోనీ అదృష్టశాలులా ఉంటే మందభాగ్యులు. ఇక్కడ భాగ్యమంటే భగవత్ కృప అనే అర్థం. అందుకే ప్రతి ఒక్కరూ ఏదో ఒక దౌర్భాగ్యంతో

బ్రతుకుతూ చస్తుంటారు. చస్తూ బ్రతుకుతారు. ధనవంతుడైనా ధనహీనుడైనా ఇదే వరస. అంచేత ఏ పుణ్యకార్యాలూ చేయలేరు. ఇంక ఆత్మకు శాంతి అలవడే మార్గం ఏమిటి? అని కలియుగ ప్రారంభంలోనే వ్యాసుడు ప్రశ్న వేసుకొని – భాగవత కథాశ్రవణమే సుఖప్రదాయిని – అని సిద్ధాంతీకరించాడు.

ఈవాళ శ్రీవారిని దర్శించటంలో ప్రతి ఒక్కరికీ ఒక 'తొందర' (త్వర) కనిపిస్తోంది. ఈ 'త్వర' కలిమానవుడిలోని దౌర్భాగ్య లక్షణం. దీన్ని అర్థం చేసుకుంటే ఇన్ని సమస్యల్ని ఎందుకు మనమే సృష్టించుకుంటున్నామో అర్థమవుతుంది.

**పుణ్యస్య ఫలమిచ్ఛంతి – పుణ్యం నేచ్ఛంతి మానవాః**

**న పాపఫల మిచ్ఛంతి – పాపం కుర్వంతి యత్నతః** – అన్నారు పెద్దలు.

కలిమానవులు పుణ్యంవల్ల వచ్చే ఫలాలు కావాలని కోరుకుంటారు. కాని పుణ్యకార్యం మాత్రం చేయడానికి ఇష్టపడరు. పాపంవల్ల వచ్చే ఫలితం మాత్రం ఎవరికీ ఇష్టం ఉండదు. కాని ప్రయత్న పూర్వకంగా పాపాలే చేస్తుంటారు.

ఈ పాపాలలో మొదటిది విపరీతంగా సంపాదించడానికి అనేక మార్గాలు అవలంబించటం. రెండవ పాపం ఎదుటివాడు పాడైపోయినా పరవాలేదు 'నేను' (అహంకారం) బాగుండాలి; అన్నీ నావే కావాలి (మమకారం) – ఈ రెండూ బాగా పాతుకుపోయే వేళ్ళలాగా మనస్సులో దిగబడిపోతాయి. వీటినుండి మనిషి చేయని తప్పిదమంటూ ఉండదు.

వీటిని శ్రీ వేంకటేశ్వర స్వామి పోగొడతాడని – ఆయన 'వడ్డికాసులు' తీసుకుని మన పని నెరవేరుస్తాడనే 'అజ్ఞానం'తోటి ఒక మనోభావం ఆధునిక



మానవుల్లో పేరుకుపోయింది. స్వామి 'పాపాల్ని' పోగొడతాడు అనటానికి అర్థం ఇలా వివరింపబడింది.

"సంస్కృతంలో 'వ' శబ్దానికి పాపాలు అనే అర్థమే కాకుండా మోక్షం, అమృతం అనికూడా అర్థం ఉంది. 'కట' అంటే భవిష్యోత్తర పురాణంలో నాశనము చేసేది అని అర్థం చెప్పుకున్నాం కదా! వామన, వరాహాది పురాణాల్లో 'కట' కు ఐశ్వర్యం అని అర్థం.

ఈ పర్వతం, మోక్షాన్ని, ఐశ్వర్యాన్ని ఇచ్చేది కాబట్టి వేంకటాచలమని పేరు వచ్చింది. ఈ రెండు అర్థాలకు సాంగత్యం ఉంది. సమన్వయం చేసుకోవటం అంత కష్టం కాదు.

ఎంతవరకు పాపాలు ఉంటాయో అంతవరకు జ్ఞానం రాదు. జ్ఞానం వస్తేగాని మోక్షం రాదు. శ్రీమధ్వాచార్యుల వారి బ్రహ్మసూత్ర భాష్యానికి జయతీర్థులు నామ టీక రచించేటప్పుడు – పాపానికి జ్ఞానానికి ఉన్న సంబంధం గురించి వివరించారు.

మనకి పాపాలు ఉన్నంతవరకు సాధన జరగటం కష్టం. శాస్త్రం చదవాలన్న ధ్యాస ఉండదు. ఒకవేళ చదవగల్గినా అర్థం కాదు. పోనీ కొన్ని సందర్భాలలో అర్థం తెలిసినా ఆచరించడానికి అనుసంధానం చేసుకోవటానికి బుద్ధి పుట్టదు. ఆచరించితే కాని అర్థం తెలిసినా ఆ జ్ఞానానికి ప్రయోజనం చేయలేదు.

ఇలా జ్ఞాన సంపాదనకు ప్రతిబంధకాలు వస్తుంటాయి. పాపాలు నాశనమయితే ఈ ప్రతిబంధకాలు తొలిగి సాధన జరుగుతుంది.

అలాగే పాపాలున్నంతవరకు దారిద్ర్యం లేదా ధనం వున్నా; పాపాలు ఉంటే అనుభవించే అవకాశం ఉండదు. ఇలా ఐశ్వర్యం కావాలన్నా దాన్ని అనుభవించాలన్నా పాపాలు పోవాలి. అవి పోతేనే జ్ఞానం – ఐశ్వర్యం, మోక్షం.

'నాన్యః పంథా అయనాయ విద్యతే' అని పురుషసూక్తంలో చెబుతారు. జ్ఞానంవల్లనే మోక్షం అనీ, కేవలం కర్మవల్ల సాధ్యం కాదని" (పు. 104-105) దీని అర్థం.

* * *

అంచేత కేవలం హుండీలో మన పాపఫలంగా వచ్చిన ధనాన్ని బంగారాన్ని వేసేయటంవల్ల పాపాలు పోవు. మరలా ఈ పాపం నాచేత చేయించవద్దన్న పశ్చాత్తాపంతో తపించడానికి కొండకు రావాలి.

1) పశ్చాత్తాపంతో పాపప్రక్షాళనంకోసం తీవ్రంగా తపించడానికి తిరుమల మీద, తీర్థాలలో స్నానం చేసేటప్పుడు సంకల్పించుకొని విధివిధానాలతో స్నానం చేయడం.

2) ఆయా భక్తులు ఎవరెవరు ఇలా స్నానంచేసి అక్కడ ఉద్ధారం పొందారో ఆ గ్రంథాలను చదివి అర్థం చేసుకొని స్నానం చేయడం.

3) క్షేత్ర దర్శనానికి వచ్చేటప్పుడు ఈ విషయాలన్నీ తెలిసిన ఒక వృద్ధుడినో, పండితుడినో వెంటబెట్టుకొని రండి. వారితోపాటు మీరుకూడా ఆ గ్రంథాలను మీరూ వారి సాయంతో చదవడం. (శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ గారి తిరుమల లీలామృతం)

* * *

ఈ మూడు పనులూ మనం తప్పకుండా కొండమీద చేయటం నేర్చుకోవాలి. 2, 3 సంవత్సరాలకు ఒకసారి స్వామివారిని దర్శించినా పరవాలేదు. ఆ దర్శనం మీ జీవిత గమనాన్ని మార్చేలా విధివిధానాల ప్రకారం పవిత్రంగా 'యాత్ర' చేయండి.



**'నీవు కావలెనన్న రిక్తు ధనపతినిగా**
**భావుకంబుగ రక్తు భక్తునిగ జేతువో గోవింద'**

– అని ఒక భక్త మహాశయుడు ఈ రహస్యాన్నే కీర్తించాడు. భక్తుడై దర్శిస్తే దానివల్ల జ్ఞానం – దానివల్ల 'విముక్తి' (ప్రశాంతత) తప్పకుండా సిద్ధిస్తుంది. శ్రీవారు ఇచ్చే ఐశ్వర్యం – అమృతత్వం 'అదే'. అది 'ధనం'వల్ల 'కర్మ' వల్ల రాదు.

* * *

**అన్యక్షేత్రే కృతమ్ పాపమ్ పుణ్యక్షేత్రే వినశ్యతి**
**పుణ్యక్షేత్రే కృతం నైవ బ్రహ్మలోకేఽపి నశ్యతి**

– అని ఒక ప్రసిద్ధ శ్లోకాన్ని పెద్దలు ఉదాహరిస్తుంటారు. ఈ శ్లోకం అర్థాన్ని ఈ రోజుల్లో మనం తప్పకుండా తెలుసుకోవాలి. ఇతర ప్రాంతాలలో పాపం చేసే పుణ్యక్షేత్రంలో చేసే దైవసేవవల్ల నశిస్తుంది. కాని పుణ్యక్షేత్రంలోనే పాపం చేస్తే అది సాక్షాత్తు బ్రహ్మలోకంలో కూడా నశించదు అని దీని భావం. దైవ ద్రవ్యాపహరణ, దైవ ద్రవ్య దుర్వినియోగం చాలా పాపమని పెద్దలు శాసించి ఉన్నారు.

**న విషం విషమిత్యాహుః**
**దైవస్వం విషముచ్యతే**
**విషమేకాకినం హంతి**
**దైవస్వం పుత్రపౌత్రకమ్**

విషం విషం కాదు. దైవం సొత్తే నిజమైన విషం. విషం తాగినవాడిని మాత్రమే చంపుతుంది. దేవుడి సొత్తు తిన్నవాడినే కాదు; వాడి కొడుకుని, మనవడిని – ఇలా వంశాన్నే నశింపజేస్తుంది.

దైవస్వం పుత్ర పౌత్రకమ్ – అని శాసనాల్లో చివర్లో చెక్కినదానికి అర్థం ఇదే. ప్రాచీనులు 'దైవ' సంబంధమైన మడినైనా, మాన్యాన్ని అయినా స్వామివారి ధన కనక వస్తువాహనాలైనా 'విషం' లాగా చూసేవారు కాబట్టే అవి ఇంతకాలం వేలకొద్దీ సంవత్సరాలుగా నిలిచి ఉన్నాయి. ఈనాటి మనిషి 'గుడినీ గుడిలోపలి లింగాన్నీ' అన్నిటినీ మింగేయాలని చూసే తత్త్వం ఒకటి పెంచుకుంటున్నాడు. ఆలయ సంస్కృతి అంటే ఏమిటో తెలియకపోవటంవల్లనే ఈ పరిస్థితి దాపురించింది.

దీన్ని అధిగమించి ఆలయ 'సంస్కారాన్ని' మనం కాపాడుకోవాలి. దర్శనం సఫలం కావాలంటే దేవుడి విషయంలో ఇంతవరకు ప్రస్తావించిన విషయాలన్నీ తెలియాల్సిన అవసరం ఉంది.

పుణ్యం చేస్తున్నప్పుడు కొద్దిగానైనా తెలుస్తుంది – ఇది పుణ్యమని. పాపం చేస్తున్నప్పుడు ఏమాత్రం తెలియదు. ఆ మాయలక్షణం పాపంలో ఉంది.

అందువల్ల పుణ్యక్షేత్రానికి వచ్చి ప్రాచీన కాలంలో ఏం చేసేవారో మరికొన్ని గ్రంథాలలో వివరంగా ఉన్నాయి. ఉదాహరణకు శ్రీ వేంకటాచల మాహాత్మ్యంలో ఎన్ని అద్భుత విషయాలు ప్రస్తావించారో డా॥ దీవి శ్రీనివాసాచార్యులు. దామెర చినవెంకటరాయకవి రచించిన 'శ్రీ వేంకటాచల మాహాత్మ్యం' లోని వర్ణనల్ని ఆధారంగా వివరించి ఉన్నారు.

ఆ రోజుల్లో తిరుమలక్షేత్రం గొప్ప 'తపోభూమి'. అందుకే ఎంతోమంది ఉపాసకులు ఆ పుణ్యక్షేత్రంలో సుదీర్ఘకాలం ఉండి తమ తపస్సును, ఉపాసనను కొనసాగించేవారట.

కొందరు అష్టాక్షరీమంత్ర పారాయణం చేసేవారు. గోపాల బీజోపాసకులు కొందరు. జగన్నాథ ఉపాసకులు మరికొందరు. తారక మంత్రోపాసకులు, త్రివిక్రమోపాసకులు, ద్వాదశాక్షరీమంత్రోపాసకులు, నృసింహోపాసకులు,



ప్రణవోచ్చారకులు, ముక్తి బీజోపాసకులు, వరాహమంత్రోపాసకులు, శ్రీమన్నారాయణోపాసకులు, శ్రీహరి ఉపాసకులు, హరి సౌమ్యప్రతిబింబ ఉపాసకులు – ఇలా ఎన్నో సంప్రదాయాలకు చెందిన మహాపురుషులు అక్కడ స్వామిని భిన్నస్థాయిలలో, రూపాలతో, ప్రయోజనాలను కోరి ఉపాసించేవారు.

వీరి తపో విధానాలు కూడా విలక్షణంగా ప్రత్యేకంగా ఉండేవట. కొందరు అంగుష్ఠాగ్రస్థితులు (బొటనవేలుపై నిలబడ్డవారు), కొందరు అక్షమాలాధరులు, కొందరు ఏకపాద సంస్థితులు, మరికొందరు కమలహోమతత్పరులు, కొందరు కాషాయం ధరించినవారు, కుంభకాదనులు మరికొందరు.

ఇంకా కొందరు కూర్మాసనంలో తపస్సు చేస్తుండేవారట. ఇంకా కృష్ణాజినధరులు, గోముఖాసనాసీనులు, దశాధిష్ఠిత యోగకరణులు – నాడీశుద్ధులు, పంచాగ్ని మధ్యస్థితులు. పద్మాసన స్థితులు, ప్రణవాసన స్థితులు, పర్ణాసన స్థితులు, పూరకాసనులు, ఫలమూలాశనులు, భద్రాసన స్థితులు, భూశయనులు, రేచక స్థితులు, వల్కలధారులు, వాయుభోజనులు, సింహాసనస్థులు, సిద్ధులు, సుషుమ్నాయోగులు, సూర్యోన్ముఖులు, స్వస్తికాసన స్థితులు – ఇలా ఉండేవారట.

ఈ వివరాలు ఎందుకిచ్చానంటే ఇప్పుడు మనం కొండమీద 'ధ్యానమందిరం' పెట్టినా అక్కడవెళ్ళి కనీసం పది నిమిషాలు కూర్చుని శ్రీవారి ధ్యానంలో ఉండటానికి కూడా యాత్రికులకు సమయం లేకపోతోంది. అది ఎవరి తప్పూ కాదు. 'కలి' లక్షణమది.

ధ్యానవిషయం వచ్చింది కాబట్టి చెబుతున్నాను – వేరేచోట్ల 'ధ్యానం'లో ప్రవేశించడానికి 15 నిమిషాలు పడితే, కొండమీద, మీరు ఎక్కడైనా కూర్చోండి 5 సెకన్లలో బ్రహ్మపదార్థం దగ్గరుంటారు. అంత 'విద్యుత్తు' ఉన్న దివ్యధామమది.

దాన్ని అర్థం చేసుకొని మన జన్మలు సార్థకం చేసుకొందాం. అందుకే ఈ అధ్యాయాన్ని 'దర్శన సాఫల్య'మన్నాను.

తిరుమలదర్శనం 'సఫలం' కావటానికి పూర్వీకులు కొన్ని పనులు చేయమని నిర్దేశించి ఉన్నారు. వేంకటాచల మాహాత్మ్యంలోనే ఈ విషయాలూ ఉన్నాయి.

తొలుత 'అన్నదానం' చేయమన్నారు – క్షేత్రానికి బియ్యం, కూరగాయలు వగైరాలు తీసుకువెళ్ళి స్వయంగా వంటచేసి అక్కడ వచ్చి ఉన్న యాత్రికులకు అన్నంపెడితే దాన్ని అన్నదానం అంటారు. ఒక 50 సంవత్సరాలకు మునుపు కూడా కొండమీద కొందరు ఈ ప్రాంతంలోని రైతు కుటుంబాల వాళ్ళు ఇలా చేసేవారు. అలా చేసే మొత్తం యాత్రను 'తీర్థం పోవటం' అనేవారు. వచ్చిన తరువాత కూడా స్వామివారి ప్రసాదాన్ని పంచి అన్నదానం చేసేవారు. ఇది చాలా ప్రధానవిషయం.

ఆలయాన్ని 'మార్జనం' చేయటం (కసువు చిమ్మి నీరుచల్లి ముగ్గులుపెట్టడం) – ఇది చాలా ముఖ్యం. దీన్నే ఉత్తరదేశంలో 'కరసేవ' అనే పేరుతో చేస్తారు. మన 'శ్రీవారిసేవ' దాదాపు ఇలాంటిదే. ఈ సేవవల్ల శ్రీవారిదర్శనం నిస్సందేహంగా సఫలమవుతుంది. ఇలాగే గ్రామనిర్మాణ (వసతి సౌకర్యం), జలసేచన (రథోత్సవాదుల ముందు దారిలో నీళ్ళు చల్లి శుభ్రంగా ఉంచటం – ఇలా వచ్చే రథాన్ని 'మడిరథం' అనేవారు) జలశాలలు (చలివేంద్రాలు); పూలమాలలు కట్టడం; భూషణాదులు సమర్పించడం – పూల, పండ్లతోటలను పెంచటం; విద్యాదానం చేయటం – ఇవి తిరుమల కొండమీద చేస్తే 'పుణ్యం' వస్తుందని పెద్దలు చెబుతారు.

నిజమే! కొన్ని శతాబ్దుల ముందు భక్తులే ఈ పనులన్నీ చేసి ఉంటారు. రాను రాను ఒక ఆలయవ్యవస్థ – పరిపాలన – సిబ్బంది వచ్చాక యాత్రికులకు



'దర్శనం' ఒకటే మిగిలిన పని అయిపోయింది. కాని ఇప్పటికీ స్వచ్ఛంద సేవకులుగా ఈ పనుల్లో పాలుపంచుకొంటున్న మహాభక్తులు ఉన్నారు. అంచేత కొందరైనా దర్శనాన్ని సఫలం చేసుకుంటున్నారు. వేద, సంస్కృత, సంగీత, నృత్య, కళాశాలలు, వైద్యసంస్థలు – ఇవన్నీ స్వామివారి 'సేవ'లో భాగమన్నది ఇక్కడి విషయం. వీటిచేత దర్శనం శ్రీవారి అనుగ్రహాన్ని ప్రసాదిస్తుంది.

శ్రీవారి పాదపద్మాలను ఎన్నో దశాబ్దాలు సేవించి నిరంతరం స్వామివారి ముఖారవింద దర్శనంతో పవిత్రుడైన అన్నమాచార్యులు కొన్ని కీర్తనల్లో నీ భక్తుడైన నాకు కూడా ఈ 'మాయ' తొలగటం లేదేమయ్యా! అని బాధపడ్డాడు.

ఒక కీర్తన చూద్దాం.

**ప॥ ఎక్కడి మానుష జన్మంబెత్తిన ఫలమేమున్నది**
**నిక్కము నిను నే నమ్మితి నీచిత్తంబికను ॥ఎ॥**

**చరణాలు మరువను ఆహారంబును – మరువను సంసారసుఖము**
**మరువను ఇంద్రియభోగము – మాధవ నీ మాయలు**
**మరచెద సుజ్ఞానంబును – మరచెద తత్త్వరహస్యము**
**మరచెద గురువును దైవము – మాధవ నీ మాయ ॥ఎ॥**

**" విడువను పాపము పుణ్యము – విడువను నా దుర్గుణములు**
**విడువను మిక్కిలి యాసలు – విష్ణుడ నీ మాయ**
**విడిచెద షట్కర్మంబులు – విడిచెద వైరాగ్యంబును**
**విడిచెద నాచారంబును – విష్ణుడ వీ మాయ ॥ఎ॥**

**" తగిలెద బహులంపటముల – తగిలెద బహుబంధంబుల**
**తగిలెద మోక్షపు మార్గము – తలపున ఎంతైనా**
**అగపడి శ్రీ వేంకటేశ్వర – అంతర్యామివై**
**నగినగి నను నీవేలితి – నాకా ఈ మాయ ॥ఎ॥**

ఈ పశ్చాత్తప్త హృదయాన్ని స్వామివారు లాలిస్తారు. అందుకే తరిగొండ వేంగమాంబ, మలయాళ స్వామివారు, తిరుమల కొండలమీద గుహల్లో సుదీర్ఘకాలం తపస్సు చేశారు. మనం ఈ విషయాన్ని మనస్సులో ఉంచుకొని వైష్ణవ భాగవత ధర్మాన్ని ఆశ్రయించి 'మాయ'ను తరించడానికి శ్రీవారి పాదపద్మాలను సమాశ్రయించాలి. ఇదే శ్రీకృష్ణుడుగా భగవంతుడిచ్చిన ఆదేశం కూడా.

**'సర్వధర్మాన్ పరిత్యజ్య – మామేకం శరణం వ్రజ**
**అహం త్వా సర్వపాపేభ్యో – మోక్షయిష్యామి మా శుచః'**

– అని భగవద్గీతలో శ్రీ స్వామివారు పార్థుడికి బోధ చేశాడు. నన్నే శరణు కోరు. తక్కిన ధర్మసందేహాలన్నీ కట్టిపెట్టు. నేను నీ పాపాలన్నింటినీ పోగొట్టి నిన్ను విముక్తుడిని చేస్తాను. ఏడవవద్దు! అని స్వామి అర్జునుడి బాధను పోగొట్టారు.

శ్రీవారిమూర్తి కూడా వరదహస్తంతో బోధిస్తున్న రహస్యమూ ఇదేనని సుప్రభాత స్తోత్రాలలో ప్రతివాద భయంకర అణ్ణన్ స్వామివారు వర్ణించి ఉన్నారు.

**పార్థాయ తత్సదృశ సారథినా త్వయైవ**
**యౌ దర్శితౌ స్వచరణౌ శరణం వ్రజేతి**
**భూయోఽపి మహ్య మిహ తౌ కరదర్శితౌ తే**
**శ్రీ వేంకటేశచరణౌ శరణం ప్రపద్యే (ప్రపత్తి – 11)**

స్వామీ! అర్జునుడికి తగిన సారథివై, నన్ను శరణు పొందు అని ఏ పాదాలను చూపించావో, ఆ పాదాలనే ఇప్పుడూ నీ చేయి చూపిస్తోంది. అలాంటి నీ చరణయుగళాన్ని శరణు వేడుతున్నాను.

నా భక్తులెవరికైనాసరే సంసారసాగరం 'మోకాలి బంటి'గా మాత్రమే ఉంటుంది. అగాధంగా ఉండదు. సులభంగా దాటి పోనిస్తాను – అని 'కటి'



(అభయ) హస్తం ద్వారా స్వామి సూచిస్తున్నాడని పెద్దలు 'కటిహస్త' దర్శన రహస్యాన్ని వర్ణించి ఉన్నారు.

ఇలా శరణాగతిని మనం పొందినపుడే శ్రీస్వామివారి అనుగ్రహ పాత్రులవుతారు. ఆ అనుగ్రహం అమృతత్వాన్ని కల్గింది. అది మనల్నే కాదు మన పిల్లల్నీ వాళ్ళ పిల్లల్నీ వాళ్ళ సంతానాన్నీ కూడా కాపాడుతోంది. ఈ భావనతో సేవించినపుడే శ్రీవారిదర్శనం సఫలమవుతుంది.

**హైమోర్ధ్వపుండ్ర మజహన్మకుటం సునాసమ్**
**మందస్మితం మకరకుండల చారుగండమ్**
**బింబాధరం బహుళ దీర్ఘకృపాకటాక్షమ్**
**శ్రీవేంకటేశ ముఖమాత్మని సన్నిధత్తామ్!**

ఈ శ్లోకాన్ని మనస్సులో స్మరించుకొంటూ ఆలయం నుండి వెనుకకు మరలివద్దాం.

* * *

**అధ్యాయం - 6**

# పునర్దర్శన ప్రాప్తిరస్తు

శ్రీవారి దర్శనంలో చివరిమజిలీ తిరుగు ప్రయాణం. అప్పుడు 'పునర్దర్శన ప్రాప్తిరస్తు' అని మనకు మనమే ఒక ఆశీర్వాదం చేసుకొంటాం. నిజానికి దీనికి వెనుక ఆలయ సంప్రదాయం ఉంది. అది పెద్దలద్వారా విన్నది చెబుతున్నాను.

పూర్వకాలంలో సేవ పూర్తి అయిన తరువాత 'అర్చకుడి'కి నమస్కరించి వారి ఆశీస్సులు అనుమతి కోరేవారు. వారు అప్పుడు 'పునర్దర్శన ప్రాప్తిరస్తు' (మళ్ళీ దర్శనానికి వద్దురుగాక!) అని ఆశీర్వదించి పంపేవారు. దీన్నే 'దేవుడు వరమిచ్చినా పూజారి వరంకూడా కావాలి' అని పెద్దలు సామెతలాగా చెబుతారు. అర్చకుడు కాకపోతే తమ మత సంప్రదాయానికి చెందిన గురువులు / ప్రతినిధులు – ఎవరో ఒకరు ఈ ఆశీస్సును ఇచ్చేవారు.

స్వామివారి విరహాన్ని భరించడం చాలా కష్టం. పూర్వయుగాల్లో ఆళ్వారులు ఈ వియోగాన్ని భరించలేమని ఎన్నో విధాలుగా విలపించిన సందర్భాలు పాశురాల్లో ఉన్నాయి. గోదాదేవి విరహ వర్ణన అంతా ఇదే. ఏ వసతులులేని ఆ కాలంలో రాయలవంటి 'ప్రభువు' అన్నిసార్లు కొండ ఎక్కాడంటే పునర్దర్శనాభిలాషలో ఉన్న స్వామి ఆకర్షణ అంత గొప్పదని అర్థం.

ఇక్కడ ఒక ప్రశ్న వస్తుంది. మనం స్వామిని చూడాలని అనుకుంటామా! స్వామి మనల్ని చూడాలని అనుకొంటారా! అని. నిజానికి మనం చూడాలని కోరుకోవటం కూడా చేతకానివాళ్ళం. మనచేత ఆ కోరిక కల్గించేవాడూ ఆయనే. అంచేత మనం వారిమీద చూపే 'భక్తి'కన్నా మనపైన శ్రీవారికున్న 'వాత్సల్యమే' అధికం. శ్రీమద్రామాయణంలో 'సుందరకాండ' చివర్లో ఈ రహస్యం ఉంది.



సీతాదేవి ఆంజనేయుడిలో చెబుతుంది : "నాకు రావణాసురుడు రెండు నెలలు గడువు పెట్టాడు. అందులో ఒకమాసం మాత్రమే మిగిలి ఉంది. ఈ మాసం రోజులు నా ప్రాణాల్ని ఎలాగైనా కాపాడుకొంటాను. మాసం తరువాత ఒక్క క్షణం కూడా జీవించను. అంతలోపల నా స్వామి రావాలి! నన్ను ఉద్ధరించాలి. ఈ విషయం శ్రీవారికి చెప్పు" అని అంటుంది.

ఈ విషయం శ్రీరాములవారికి హనుమ వినిపించాడు. అప్పుడు శ్రీరాములవారన్నారట:

**చిర జీవతి వైదేహీ యది మాసం ధరిష్యతి**
**క్షణం సౌమ్య న జీవేయం వినా తామసితేక్షణామ్**

ఒక మాసం రోజులు బ్రతకగల్గితే ఆమెకు ఏ అపాయమూ లేదు. ఎంతకాలమైనా ఉండగలదు. కాని నేనిక ఆమె విరహం భరించి ఒక 'క్షణం' కూడా ఉండలేను. వెళ్దాంపద! అన్నాడట.

తిరుప్పాణ్ ఆళ్వారు విషయంలో శ్రీరంగనాథుడు ఇలాగే అంటాడు: "లోకసారంగమునీ! ఆ భక్తుడు గుడిలోకి రాకూడదంటావు. పోనీ నన్ను తీసుకువెళ్ళవయ్యా! ఆ గాయకశిఖామణి 'నాదనీరాజనానికి' ముగ్ధుడినయ్యాను. ఆయన్ని చూడకుండా ఉండలేను' అని అంటారు శ్రీరంగనాథస్వామి.

మన విషయమూ అంతే! దర్శన సంకల్పమూ ఆయనదే. దర్శనమిచ్చేవాడూ ఆయనే. మనం ఆయన ఆశ్రితులం. మనకు స్వతంత్రత లేదు. ఈ పరతంత్ర భావన ఉన్న వైష్ణవ భక్తుడికి రాగద్వేషాలు సంపూర్ణంగా నశిస్తాయి.

అప్పుడే శ్రీవారి 'దర్శనం' అనుభూతిగా మారుతుంది. ఆ అనుభూతిలో ఉన్నవాడికి ప్రతిచోటా శ్రీనివాసుడే కనిపిస్తాడు –

'ధన్యులమైతిమి ఓ దేవా – మరల దర్శనమిమ్ము మహానుభావా!' అంటూ ప్రతిజీవీ వేడుకొంటుంది. మరలా రావడం కష్టం కాబట్టే శ్రీవారి ఆలయాలు కొన్నివేలు – ప్రపంచమంతటా వెలుస్తున్నాయి. అయినా లక్షలకొలదీ తిరుమలకు వస్తూనే ఉన్నారు – ఆ స్వామి ఇష్టంగా కొలువై ఉన్నచోటు అదే కాబట్టి. ఈ అర్థంలోనే తిరుమలను సార్థకంగా భూలోక వైకుంఠమంటారు*.

* * *

*తరిగొండ వేంగమాంబ మహాయోగిని. ఆ మహామాతృమూర్తి తన 'శ్రీ వేంకటాచల మాహాత్మ్యము' అనే కావ్యంలో జ్ఞానభక్తి వైరాగ్య యోగాలకు ఎన్నో విఘ్నాలు కలుగుతాయని చెబుతూ తిరుమలలోని తీర్థాలలోని స్నానంవల్ల సాత్త్విక జ్ఞానం కలుగుతుందని వివరించి చివరకు '... అటుగావున తత్తీర్థపానంబున దేహంబు సిద్ధి వహించు. అటువలె దృఢకాయుండైన వానికి శ్రీవేంకటేశ్వరుని కైంకర్యము సేయుటే పురుషార్థంబను" – అని క్షేత్రదర్శన – సేవాఫలాన్ని వివరించింది. అంచేత నిరంతరం భక్తులు స్వామి సేవను, దర్శనాన్ని కోరుకుంటూ ఉండాలి.



**అధ్యాయం - 7**

# పిలిస్తే పలికే అంతర్యామి

శ్రీనివాసుడు తిరుమల 'కొండ' మీద నివసిస్తున్నా; ఆయన అంతర్యామిగా సకలజనుల, జంతువుల హృదయాల్లోనూ స్థిరంగా ఉంటాడు. ఎవడైనా బాగా 'పిలిస్తే' పలుకుతాడు. పిలిస్తే పలికే స్వామిగా కలియుగంలో శ్రీనివాసునికి మాత్రమే పేరుంది.

కృతయుగంలో నరసింహుడుగా మహావిష్ణువు ప్రహ్లాదుడు పిలిస్తే పలికాడు. తన అంతర్యామిత్వాన్ని నిరూపించుకున్నాడు. స్తంభంలోనూ దర్శనమిచ్చాడు.

త్రేతాయుగంలో నరవానర బలంతో రావణ సంహారంచేసి ఈ సృష్టిని నిలపగలవాడూ, నశింపజేయగలవాడూ తానే అని నిరూపించాడు.

ద్వాపరయుగంలో ఎన్నోసార్లు తన 'విశ్వ' రూపాన్ని ప్రదర్శించి తనలో అందరూ ఉన్నారని, అందరిలో తానున్నానని నిరూపించాడు.

శ్రీనివాసుడు కలియుగంలో అదేపని చేస్తున్నాడు. ఋషులు, మునులు ఏ పరమపదాన్ని వాంఛించి తపస్సులు చేస్తారో, శాస్త్రాలు ఏ దివ్యరహస్యాన్ని వ్యాఖ్యానించడంలో విఫలమయ్యాయో – ఆ పరమపదాన్ని తానే అందరి హృదయాలలోనూ స్పందింపజేస్తూ ఉండటమే శ్రీనివాసుని అవతారమహిమ.

అందుకే 'శ్రీవారిలీలలు' అనంతంగా ఉన్నాయి. భక్తుల అనుభూతులు కొన్నివేల కథలుగా వ్యాపించి ఉన్నాయి. కుదరని రోగాలు కుదురుతాయి. పెళ్ళిళ్ళు జరగవనుకుంటే జరుగుతాయి. ఉద్యోగం రాదనుకుంటే వస్తుంది. వీసా ప్రత్యక్షమవుతుంది. పేదవాడు లక్షలకోట్లకు పడగెత్తుతాడు – అజ్ఞాని

జ్ఞానవంతుడవుతాడు. ఈ అసాధ్యాన్ని సుసాధ్యాలు చేస్తూ శ్రీనివాసుడు అందరిలోనూ తానున్నానని, తాను అందరివాడినని, ఇదొక బృందావనమని- రాగద్వేషాలు ఇక్కడ పనికిరావని ప్రబోధిస్తూ నిరంతర బ్రహ్మానందమగ్నులైన ఋషులమధ్యనున్న పరమానందస్వరూపులుగా విరాజిల్లుతూ ఉన్నారు.

శ్రీనివాసుడు ధర్మనిర్వహణకోసం కలియుగంలో అర్చామూర్తిగా ప్రకాశిస్తున్నాడు.

**సర్వాగమానామాచారః ప్రథమం పరికల్ప్యతే**
**ఆచారప్రభవో ధర్మః ధర్మస్య ప్రభురచ్యుతః**

అని విష్ణు సహస్రనామంలో వ్యాసభగవానుడు సెలవిచ్చాడు. ఆగమం నుండి ఆచార విధి తెలుస్తుంది. ఆచారంలో నుండే ధర్మం సత్యస్వరూపంగా ప్రభవిస్తుంది. ఆ ధర్మాన్ని శ్రీ మహావిష్ణువు పరిరక్షిస్తూ ఉంటాడు.

అందుకే 'ధర్మప్రచార పరిషత్' పేరిట 'ధర్మరక్షణ సంస్థ' ఒకటి తిరుమల తిరుపతి దేవస్థానాల పక్షాన ధర్మప్రబోధ బాధ్యత నిర్వహిస్తోంది. మీరున్న ప్రాంతంలోనే 'ధర్మాన్ని' మీరు రక్షిస్తే అది కొండకు వచ్చి శ్రీవారిని సేవించినంత పుణ్యాన్నే ఇస్తుంది - శ్రీవారు ధర్మస్వరూపుడు కాబట్టి.

'ధర్మో రక్షతి రక్షితః' - అన్నది అంతర్యామిగా అందరిలోనూ ఉన్న భగవంతుని ఉనికిని సూచించేమాట. ధర్మస్ఫూర్తితో బ్రతకటం, ఇతరులను బ్రతకనివ్వటం - ఈ రెండూ 'అంతర్యామిని' పూజించే విధానాలు. ఆ అంతర్యామి ఎక్కడ వెదికినా ఉంటాడు. ఏ విగ్రహరూపంలో పూజించినా పలికేది 'అతడే'. అయినా ఆయన ఉనికి విశిష్టంగా 'వేంకటాద్రి' లో ఉంది.

అన్నమయ్య ఒక సంకీర్తనలో ఈ భావాన్ని చాలా అద్భుతంగా కీర్తించి ఉన్నారు.



**ప॥ నీ వనగనొకచోట నిలిచి వుండుట లేదు**
**నీవనుచు కనుగొన్న నిజమెల్ల నీవె ॥నీ॥**

**చరణాలు: తన యాత్మవలెనె భూతముల యాతుమలెల్ల**
**అనయంబు కనుగొన్న యతడే నీవు**
**తను కన్నతల్లిగా తగనితర కాంతలను**
**అనఘుడై మది జూచు నతడే నీవు ॥నీ॥**

**" సతత సత్యవ్రతాచారసంపన్నుడై**
**అతిశయంబుగ మెలగునతడే నీవు**
**ధృతి దూలి ద్రవ్యంబు తృణముగా భావించు**
**హతకాముకుండైన యతడే నీవు ॥నీ॥**

**" మోదమున సుఖదుఃఖములు నొక్కరీతిగా**
**ఆదరింపుచునున్న యతడే నీవు**
**వేదోక్తమతిమైన వేంకటాచలనాథ**
**ఆదియును నంత్యంబు నంతయును నీవె ॥నీ॥**

మానవుడే - మాధవుడు - ఎప్పుడు? ఆత్మవత్ సర్వభూతాని - యః పశ్యతి స పండితః' అని పెద్దలు చెప్పారు. తనయందు నఖిలభూతములందు నొకభంగి - సమహితత్వంబున జరగువాడు' అని పోతన గారు ఈ మహాసంస్కారాన్నే ప్రహ్లాదుడిలో చూపించింది. అలాంటివాడిలో శ్రీవారు అంతర్యామిగా ఉంటారు. అందుకే శ్రీపతిదాసులు ఎన్నడూ చెడిపోరు.

'కన్ను దోయికిని నన్యకాంతలడ్డంబైన - మాతృభావంబున మరలువాఁడు' (మాతృవత్ పరదారాంశ్చ) అని ప్రహ్లాదుడిలో పరస్త్రీలో మాతృమూర్తిని చూసే గుణం వర్ణించాడు. శ్రీరాముడు అలా ప్రవర్తించిన మానవోత్తముడు.

సతత సత్య వ్రతాచార సంపన్నుడై దీక్షితుడైన వాడిలోనూ పరమాత్మ సన్నిహితంగా ఉంటాడు. మహాపురుషులెందరో ఈ 'సత్య' వ్రతపాలనచేత ముక్తులై దైవసదృశులై మన్నన పొందారు. పొందుతున్నారు కూడా. అవధూతలు, శ్రీ శంకర శ్రీమద్రామానుజ మధ్వాచార్యాది ఆచార్యపురుషులు సత్యవ్రతులే. వీరందరిలో శ్రీవారున్నారు.

'పర ద్రవ్యాణి లోష్టవత్' అన్నారు. పరధనాన్ని మట్టిలాగా భావించేవారు కూడా తాదృశులే. శ్రీమద్రామానుజులు అచ్యుల పదాంబుజాలనే బంగారంపైన వ్యామోహం కల్గిన వాడవటంవల్ల సర్వప్రపంచమూ ఆయనకు 'తృణ' ప్రాయంగా కన్పించేదట. వారిలోనూ శ్రీవారు దర్శనమిస్తారు.

ద్వంద్వాలను సమంగా చూసే 'యోగు'లలో (సుఖం – దుఃఖం; కీర్తి – అపకీర్తి; మానం – అవమానం; పుట్టుక – మరణం) కూడా శ్రీవారు సన్నిహితులై ఉంటారు.

చివరిమాట 'వేదోక్తమతి' శ్రీనివాసుడన్నది చాలా గొప్పది. వేదమంత్రంలో దాగి ఉన్నది శ్రీనివాసుడే.

బలిచక్రవర్తి వామనమూర్తికి త్రిపాద ధరణిని దానం చేస్తూ 'వేదప్రామాణ్యవిదే' అని కీర్తిస్తాడు. అంచేత వేదనాదంలో ప్రతిధ్వనించే ప్రణవం శ్రీనివాసుడే.

ఇలా విస్తరిల్లిన శ్రీవారిని కొండమీద దర్శించడంలోని సౌభాగ్యం అన్ని యజ్ఞాలకన్నా ఎక్కువ ఫలాన్ని ఇస్తుంది. అది స్వామి దర్శనంలోని పరమపద లక్ష్యస్ఫూర్తి.

**తద్విష్ణోః పరమం పదమ్ సదా పశ్యంతి సూరయః** – అని వేదం ప్రతిపాదించింది. మహాయోగులు తమ తపో నిష్ఠలో ఏ పరమపద దర్శనం చేస్తుంటారో ఆ పరమపదమే శ్రీవారి ఆలయంలోని 'మూర్తి'. వామనమూర్తి



త్రివిక్రమస్వరూపం వహించిన ఆనాటి బలికథకు సాక్ష్యం వైఖానసులు పూజించే పరమవిష్ణుతత్త్వం.

**త్రీణి పదా విచక్రమే – విష్ణుర్గోపా అదాభ్యః**

**తతో ధర్మాణి ధారయన్ – విష్ణోః కర్మాణి పశ్యతయతో**

**వృతాని పస్పశే – ఇంద్రస్య యుజ్యస్సఖాః** – అన్న వేదమంత్రాను సంధానంతోనే శ్రీవారి ఆరాధన జరుగుతుంది. కనుక 'ధర్మ' పరిరక్షణ చేసే ప్రతివారిలోనూ శ్రీనివాసుని 'అంతర్యామిత్వం' స్పష్టంగా కనిపిస్తుంది. ఇదే మాధవుడు మానవుడిలా అవతరించి సాధించే పరమార్థం. ఈ దృష్టితోనే భాగవతుల్ని ఆరాధిస్తే భగవంతుని ఆరాధించిన దానితో సమానమన్న వైష్ణవ ధర్మం భారతదేశంలో వ్యాపించింది.

ఈ జ్ఞానం పొందటమే భక్తికి పరాకాష్ఠ. క్షేత్రదర్శనానికి సాఫల్యం. అంతవరకు ముకుదిబ్బడతో గంధపు చెక్కలు మోసినా ఆ సువాసనను మనం గ్రహించలేని విధంగా ఎంత 'భక్తి' ఉందని మనం అనుకున్నా, దానికి పరమ ప్రయోజనమైన భగవదనుభూతి మనకు దొరకదు. ఎన్ని తీర్థాలలో మునకలిడినా 'చేదు' వదలదు. మనలాంటివాళ్ళు తీర్థాలనే అపవిత్రం చేస్తారు – అని తెలుసుకుని తీర్థ పవిత్రతను కాపాడి ఆ 'అంతర్యామి' ని అవమానం చేయకుండా ఉంటే అదే పదివేలు. తిరుమల – తిరుపతి 'ధర్మక్షేత్రాలు'.

ఈ రోజులలో అందరూ గుర్తించాల్సిన విషయం హైందవమతం 'మనిషిని' బాగు చేయటం కోసం పుట్టింది కాబట్టే దేవుడిని మనిషిలాగా అర్చించే సంప్రదాయాన్ని అభివృద్ధి చేసుకొన్నది. భగవంతుడిని కల్యాణ గుణ సంపూర్ణుడిగా భావిస్తూ, ఆ కల్యాణగుణాలను మనిషి సాధించాలన్నదే ఈ సంప్రదాయంలోని దివ్యసందేశం. అందుకే భగవంతునికి, భక్తునికి అనుసంధాన స్థలాలుగా దివ్యక్షేత్రాలను మహనీయులు దర్శించారు.

దేవాలయాల ద్వారా మనిషి సంస్కరింపబడి రాజసతామస గుణాలు దాటి సత్త్వగుణ ప్రధానుడై సమాహితచిత్తంతో సమాజాన్ని రక్షించగలిగే ఉన్నత వ్యక్తి అవుతాడని పూర్వికులు ఆలయాలను విద్యాకేంద్రాలుగా (ఘటికా స్థానాలుగా) నిర్మించారు. సద్గుణాలను నేర్పించారు. అంతరంగాన్ని హరికి అర్పించి బ్రతకమని బోధించారు. అన్నమయ్య ఒక కృతిలో ఈ 'అంతరంగ' సమర్పణ ప్రాధాన్యం వివరించి ఉన్నారు.

**ప॥ అంతరంగమెల్ల శ్రీహరికి ఒప్పించకుంటే**
**వింత వింతవిధముల వీడుగా బంధములు ॥అంత॥**

**చరణాలు మనుజుడై ఫలమేది మరి జ్ఞానియౌదాక**
**తను నెత్తి ఫలమేది దయ గలుగుదాక**
**ధనికుడై ఫలమేది ధర్మము సేయుదాక**
**పనిమాలి ముదిసితే పాసెనా భవము ॥అంత॥**

**" చదివియు ఫలమేది శాంతము కలుగుదాక**
**పెదవెత్తి ఫలమేది ప్రియమాడుదాక**
**మదిగల్గి ఫలమేది మాధవుదలచుదాక**
**ఎదుట తాను రాజైతే ఏలేనా పరము ॥అంత॥**

**" పావనుడై ఫలమేది భక్తి కలిగినదాక**
**జీవించి ఫలమేది చింత దీరుదాక**
**వేవేలు ఫలమేది వేంకటేశు కన్నదాక**
**భావించి తాదేవుడైతే ప్రత్యక్షమౌనా ॥అంత॥**

ఈ పాటకు వ్యాఖ్యానమే అవసరం లేదు. కాని చివరిమాట మాత్రం చాలా ముఖ్యమయింది. 'అహం బ్రహ్మాస్మి' అని ఎవడైనా అనుకొంటే అనుకోనీ. అలాంటివారిని కూడా జ్ఞానం - దయ - ధర్మం - శాంతం - ప్రియం -



మాధవుని చింతన - భక్తి - నిశ్చింత - కల్గి శ్రీనివాసుణ్ణి దర్శిస్తే తప్పా - భగవంతుడు ప్రత్యక్షంకాడు అని అద్భుతంగా ప్రబోధించాడు అన్నమాచార్యులు.

శ్రీనివాసుని దర్శనం అంటే లోనిపరబ్రహ్మను దర్శించటమే - అనే అర్థాన్ని శ్రీమద్రామానుజులు తత్త్వదృష్ట్యా గ్రహిస్తే; అన్నమాచార్యులు సాధారణ 'జీవి' అనుభవంగా వ్యాఖ్యానించిన అద్భుతసంకీర్తన ఒకటి ఉంది.

**ప॥ అంతర్యామి అలసితి సొలసితి**
**ఇంతట నీ శరణిదే చొచ్చితినీ ॥అంత॥**

**చరణాలు కోరిన కోర్కెలు కోయని కట్లు**
**తీరవు నీవవి తెంచక**
**భారపు పగ్గాలు పాపపుణ్యములు**
**నేరుపుబోవు నీవు వద్దనకా ॥అంత॥**

**" జనుల సంగముల జక్కరోగములు**
**వినువిడువవు నీవు విడిపించక**
**వినయపు దైన్యము విడువని కర్మము**
**చనవది నీవటు సంతపరచకా ॥అంత॥**

**" మదిలో చింతలు - మయిలలు మరుగులు**
**వదలవు నీవవి - వద్దనక**
**ఎదటనే శ్రీవేంకటేశ్వరా నీవదె**
**అదనుగాచితివి అట్టిట్టవక ॥అంత॥**

అన్నమయ్య ప్రబోధించిన శరణాగతి తత్త్వంలోని 'పరతంత్ర' భావన ఈ గేయంలో ప్రస్ఫుటంగా ఉంది. మనం మనలోని 'అంతర్యామి'కి పరతంత్రులం. ఈ అంతర్యామి ఆడించే నాటకమిది అని తెలియకే ఆడేస్తూ ఉంటాము. గజేంద్రుడు 'మొసలి' బారిన పడటం ఇలాంటిదే. ఎవరు

సరస్సులోనికి వెళ్ళమన్నారు? ఎవరు నీటిని తోడమన్నారు? ఎవరు మొసలి పట్టుకు చిక్కించారు?

చివరికి ఎవడీ బంధాలు కల్పించాడో ఆ స్వామే వచ్చి రక్షించాడు. ఎప్పుడు? వేయి సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తరువాత.

**లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె ప్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను మూర్ఛ వచ్చె తనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్**
**నీవే తప్ప నితఃపరంబెఱుగ మన్నింపందగున్ దీనునిన్**
**రావే యీశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా!**

అనే వేదనతో కుంగి 'కుయ్యి'డగా అప్పుడు స్వామి ఒక క్షణంలో 'చక్రం' (సుదర్శనం) పంపి గజరాజుకు బంధవిమోక్షణం కల్గించాడు.

నిజానికి అన్నమయ్య 'అలిసి' పోయి ఈ సంకీర్తన చెప్పాడనుకోవటంకన్నా; మనుష్యులందరూ ఒకస్థాయిలో అలసిపోతారు; వారి అందరిపక్షానా దీనుడై ఆలపించాడనుకోవటంలో సార్థకత ఉంది.

స్వామివారు కాపాడుతున్నారు కాబట్టి ఈ బ్రతుకు యీమాత్రం 'చెలియలికట్ట'లో ఉంది – లేకపోతే గట్టుతెగిన గోదారిలాగా ఏనాడో పాపసముద్రంలో కలిసి గుర్తు కూడా మిగిలి ఉండేదికాదన్న భావన మనలో కల్గిననాడు స్వామివారిని దర్శించిన దానికి చక్కటి దారి దొరికినట్టు. ఆ దారిని చూపించడాన్నే త్యాగరాజస్వామివారు 'తెర తీయగరాదా!' అని ఆవేదనతో అర్థించారు. పురందరదాసాది హరిదాసులు ఇలా కీర్తించి 'అంతర్యామికి' సమీపంగా బ్రతికి ఉద్ధారం పొందారు. అదే ఉత్తమమార్గం. ఈ మార్గంలో మనిషి వినయంతో తాను అల్పుడినని, అపరాధినని, 'కృపణ' భావాన్ని పొంది స్వామికృపను కోరుతారు. అన్నమయ్య ఒక కీర్తనలో ఈ భావాన్ని చక్కగా వివరించాడు. ఇదే జ్ఞానం కల్గిందనటానికి తార్కాణం.



**ప॥ పురుషోత్తముడవీవు – పురుషాధముడ నేను**
**ధరలోన నాయందు – మంచితనమేది ॥పురు॥**

**చరణాలు అనంతాపరాధములు – అటు మేము సేసేవి**
**అనంతమైన దయ – అది నీది**
**నిను నెఱుగకుండేటి – నీచగుణము నాది**
**ననునెడయ కుండేటి – గుణము నీది ॥పురు॥**

**” సకలయాచకమే – సరస నాకు పని**
**సకలరక్షకత్వము – సరి నీ పని**
**ప్రకటించి నిన్ను దూరే – పలుకే నాకిప్పుడును**
**వెకలివై ననుగాచే విధము నీది ॥పురు॥**

**” నేరమింతయు నాది – నేరుపింతయు నీది**
**సారెకు అజ్ఞాని నేను – జ్ఞానివి నీవు**
**ఈ రీతి వేంకటేశ – ఇట్టె నన్ను ఏలితివి**
**ధారుణిలో నిండెను ప్ర – తాపము నీది ॥పురు॥**

## క్షమాయాచనం

**అజ్ఞానినా మయా దోషానశేషాన్ విహితాన్ హరే**
**క్షమస్వ త్వం క్షమస్వ త్వం శేషశైలశిఖామణే**

అజ్ఞానినైన నేను తప్పులను చేశాను. ఓ శేషశైలాధిపతీ! నీవు వాటిని క్షమించాలి. క్షమించాలి. నన్ను ఉద్ధరించాలి.

**శ్రీనివాసాయ మంగళమ్**

* * *